
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 249 | విజయవాడ, శనివారం 12 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 12 April 2025 | Rs



అనంతపురం, కర్నూలులో
అకాల వర్షం
- పలు పంటలు నష్టం

2



తిప్పేసిన నరైన్, వరుణ్
చెన్నై సూపర్‌కింగ్స్‌పై కోల్‌కతా ఘన విజయం

8

పారిశ్రామికోత్పత్తి
భారీ పతనం
ఫిబ్రవరిలో 2.9 శాతానికి పరిమితం
ఏడు నెలల కనిష్టానికి చేరిక
పేలవంగా తయారీ, మైనింగ్ రంగాలు



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రజల ఆదాయాలు సన్నగిల్లడంతో సరుకుల డిమాండ్ తగ్గుతోంది. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తి సైతం నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ముఖ్యంగా తయారీ, విద్యుత్, మైనింగ్ రంగాలు పడకేయడంతో పారిశ్రామికోత్పత్తిలో భారీ పతనం చోటుచేసుకుంది. కేంద్ర గణాంకాల శాఖ (ఎన్ఎస్ఓ) అధికారికంగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) వృద్ధి 2.9 శాతానికి పరిమితమైంది. ఇది ఏడు నెలల కనిష్ట స్థాయి కావడంతో తీవ్ర ఆందోళనకరంగా మారింది. గతేడాది ఇదే నెలలో ఐఐపి వృద్ధి 5.6 శాతంగా ఉండటం గమనార్హం. ఏడాది కాలంలో ఈ స్థాయిలో పతనం కావడం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ సుస్థిరతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పారిశ్రామికోత్పత్తి ఈ స్థాయిలో పతనం కావడానికి తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల పనితీరు అత్యంత పేలవంగా ఉండటమే ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సాధారణ వస్తువులకు సైతం....

దేశ వ్యాప్తంగా సాధారణ వస్తువుల కొనుగోలుకు ప్రజానీకం తటపటాయించే పరిస్థితి ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఎన్ఎస్ఓ నివేదిక ప్రకారం 2025 ఫిబ్రవరిలో కాస్మోటిక్స్, ఆహారం, పానియాలు, ఇంధనం, వస్త్రాలు, పాదరక్షలు తదితర కన్స్యూమర్ నాన్ డ్యూరెబుల్ సరుకుల ఉత్పత్తి 2.1 శాతానికి పడిపోవడం దీనికి నిదర్శనం. రోజువారీ వినియోగంలో అత్యంత సాధారణమైన వీటి మిగతా 7లో

పల్లెలు విల విల!
- రిజర్వు బ్యాంకు నివేదిక వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి


అధికధరలతో గ్రామసీమలు కన్నీరు పెడుతున్నాయని రిజర్వ్‌బ్యాంకు తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు అనేక అంశాలపై గ్రామీణ ప్రాంతంలో పరిస్థితిని రిజర్వ్‌బ్యాంకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన తాజా సర్వే విశ్లేషించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 95 శాతం కన్నా ఎక్కువ మంది ధరలు పెరిగాయని చెప్పారు. 3.4 శాతం మంది ధరలు నిలకడగా ఉన్నాయని చెప్పగా, కేవలం 1.5 శాతం మంది మాత్రమే ధరలు తగ్గినట్లు చెప్పడం గమనార్హం.ధరా ఘాతం నుండి విముక్తి ఇప్పుడప్పుడే లభించే అవకాశం లేదని కూడా పలువురు అభిప్రాయ పడుతున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 88.7 శాతం మంది వచ్చే ఏడాది కూడా ధరలు పెరుగుతాయని చెప్పగా, 5.4 శాతం మంది నిలకడగా ఉంటాయని, 5.9 శాతం మంది తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. వస్తువుల ధరలతో పాటు చేస్తున్న ఖర్చులు కూడా పెరుగుతున్నట్లు పలువురు అభిప్రాయ పడ్డారు. ఏకంగా 90.5 శాతం మంది ఖర్చులు పెరిగినట్లు చెప్పడం గమనార్హం. వచ్చే ఏడాది కూడా ఖర్చులు పెరిగే అవకాశం ఉందని 90.8 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ఉపాధి అవకాశాపై కూడా పల్లె ప్రజలు పెదవివిరుస్తున్నారు. 35.4 శాతం మంది ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని చెప్పగా, మరో 24.9శాతం మంది ఎటువంటి మార్పు లేదని చెప్పారు.

నేడు వాట్సాప్‌లో
ఇంటర్ ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారు వాట్సాప్ ద్వారా ఈ ఫలితాలు చూసుకోవచ్చునని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృతిక శుక్లా శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదలవుతాయని వెల్లడించారు. మార్చి ఒకటి నుంచి 19వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 10,58,893 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 500,963 మంది, ఒకేషనల్ 44,581 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్ 4,71,021 మంది, ఒకేషనల్ 44,581 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,535 పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. విద్యార్థులు తమ ఫలితాలను resultsbie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. తొలిసారి వాట్సాప్ ద్వారా ఫలితాలు విద్యార్థులకు అందించే ఏర్పాట్లను ఇంటర్మీడియట్ బోర్డు చేసింది. వాట్సాప్‌లో 9552300009 నెంబర్‌కు హాయ్ అని సందేశం పంపి, హాల్ టికెట్ నెంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు నమోదు చేసి ఫలితాలు పొందవచ్చునని తెలిపారు.





గుంటూరులో నిరసన

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందే
రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వక్ఫ్ చట్టంలో చేసిన సవరణలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిం పర్సనల్‌లా బోర్డు జెఎసి పిలుపు మేరకు ముస్లిములు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సవరణ బిల్లును వెనక్కి తీసుకునే వరకు ముస్లింలంతా ఏకమై కేంద్రంతో పోరాడుదామని అన్నారు. గుంటూరు పాతబస్టాండ్ సెంటర్‌లో ముస్లిములు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. స్థానిక టిడిపి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మద్దతు ఇవ్వటానికి రావడంతో అదే వేదికపై ఉన్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నూరి ఫాతిమా పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు పలికి, ఇక్కడ ఎవరికి మద్దతు ఇవ్వటానికి వచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో అప్పటికే వేదిక ముందు ఉన్న ప్రజల నుండి వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే రాజీనామా చేయాలనే డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. చట్ట సవరణకు మద్దతు తెలిపిన టిడిపి నాయకులతో వేదిక పంచుకోలేమని సిపిఎం నాయకులు ముందుగానే వేదిక కిందకు దిగారు. నిర్వాహకు లు అందరికీ సర్ది చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరూ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడు తూ వ్యక్తిగతంగా తాను చట్ట సవరణను వ్యతిరేకిస్తు న్నానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు చిష్టీ, వివిధ సంఘాల నాయకులు ప్రసంగిం చారు. కర్నూలులోని వివిధ మసీదుల వద్ద ముస్లిములు మానవహారం నిర్వహించారు. ఆదోని మసీద్ కాలనీలో మతోన్మాద విధానాలను వ్యతిరేక িస్తూ ఆందోళన చేశారు. బాపట్లలో అంజుమన్ ఎ ఇస్లామి యా ఆధ్వర్యంలో అంజు మన్ ఇస్లామియా మసీదు నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిం చారు. జాతీయ జెండాలు, ఫ్లకార్డులు, ఫ్లెక్సీలతో ముస్లిము లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, సమాజ్‌వాదీ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గొర్ల శ్రీనివాసరావు పాల్గొని మద్దతు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలో ర్యాలీ, ఏలూరు జిల్లా నూజివీడులో ధర్నా నిర్వహించారు. విశాఖలోని గాజువాకలో శాంతియుత నిరసనలు తెలిపారు.



జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద నివాళి అర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, మూలం రమేష్ తదితరులు


వివక్ష, అసమానతలకు
వ్యతిరేకంగా పోరాడాలి
పూలే దంపతులను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు

జ్యోతిరావు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని సామాజిక వివక్షతకు, అసమానతలకు వ్యతిరేకంగా నేటి తరం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపుని చ్చారు. నెల్లూరులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి శు క్రవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పిం చారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించు కొని సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో వి.శ్రీనివాసరావు మాట్లాడారు. అంటరానితనం, నిరక్షరాస్యత, సామాజిక వివక్షత ఉన్నంత వరకూ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంటారన్నారు. ఆ రోజుల్లోనే ఆధిపత్య వాదానికి వ్యతిరేకంగా అన్ని సామాజిక తరగతుల్లోని అణగారిన మిగతా 7లో

రాణాకు 18 రోజుల కస్టడీ
- ఇతర నగరాల్లోనూ బాంబు పేలుళ్లకు కుట్ర : కోర్టుకు తెలిపిన ఎన్ఐఎ

7



పెగాసస్ నిఘా
భారత్ @ 100
- మొదటి స్థానంలో మెక్సికో
- ప్రపంచవ్యాప్తంగా 51 దేశాల్లో బాధితులు

3

వైభవంగా సీతారాముల కల్యాణం
పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు




స్వామి వారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలను తీసుకొస్తున్న చంద్రబాబు దంపతులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/ఒంటిమిట్ట

నవ్యాంధ్ర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్టలో శుక్రవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా హాజరై స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టిటిడి అర్చకు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు శ్రీ సీతారాముల విగ్రహాల శిరస్సులపై జీలకర్ర, బెల్లం పెట్టారు. సీతమ్మ వారి మెడలో మగళసూత్రాన్ని ధరింపజేశారు. స్వామివారు సీతమ్మపై ముత్యాల తలంబ్రాలు పోసే సన్నివేశాన్ని వేదపండితులు వర్ణించారు. కడప రోడ్డులో విశాలమైన మైదానంలో భారీ పందిళ్లువేసి పూల పరిమళాలు, విద్యుత్ కాంతులు, విద్యుత్ దీపాలతో కల్యాణ వేదికను అలకరించారు. అంతకు మునుపు శ్రీ సీతారాముల స్వామివారిని ఆలయం నుండి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేదపండితులు ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. మా వంశం గొప్పదంటే మా వంశమే గొప్పదని వేదపండితులు కొంతమంది సీతమ్మ వైపు, మరికొందరు రామయ్య వైపు చేరి వేడుక నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా భారీ ఏర్పాట్లు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆలయ విశిష్టత, రాములవారి ప్రాశస్త్యం, సీతారాములకు చేయించిన బంగారు ఆభరణాల గురించి వివరించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా, రాష్ట్ర నలుమూల నుండి యాత్రికులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి చైర్మన్ బిఆర్.నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, టిటిడి బోర్డు సభ్యులు ఎంఎస్.రాజు, జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాష్‌రెడ్డి, ఎంపీ సిఎం రమేష్, కడప జిల్లా మిగతా 7లో

రాజకీయ, సాంస్కృతిక వ్యూహం
- లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల్లో కొత్త ఆశలు
- ఎన్నడూ లేనంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశ ప్రజాస్వామ్య పునాదులు
- ఇంటర్వ్యూలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజాస్వామ్య పునాదులు ఎన్నడూ లేనంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 2 నుండి 6 వరకు మదురైలో జరిగిన సిపిఎం 24వ పార్టీ మహాసభ సంకల్పం, ప్రతిఘటనకు ఒక వెలుగులా ఉద్భవించిందని సిపిఎం నూతన ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి తెలిపారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ విలువలను క్షీణింపజేస్తోందని, మతపరమైన విభజనలను తీవ్రతరం చేస్తోందని విమర్శించారు. వామపక్షాల రాజకీయ, సాంస్కృతిక వ్యూహాన్ని ధైర్యంగా పునఃసమీక్షించాలని మహాసభ పిలుపునిచ్చిందన్నారు. మహాసభ తీర్మానాలు దేశవ్యాప్తంగా లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల్లో కొత్త ఆశను, ఉత్సాహాన్ని రేకెత్తించాయని చెప్పారు. దేశాభిమాని పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వెల్లడించారు. మతతత్వ శక్తులు, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి పార్టీ మహాసభ ఆమోదించిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు.

ప్రశ్న : సిపిఎం స్వతంత్ర బలం పెంచుకోవాలనే పార్టీ మహాసభ పిలుపును రాజకీయంగా ఎలా అర్థం చేసుకోవాలి?

బేబి : పార్టీ మహాసభ రెండు కీలకమైన పనులను నిర్దేశించింది. మొదట సిపిఎం సొంత బలం పెంచడం, వామపక్షాల ఐక్యత పెంపొందించడం. రెండోది ప్రమాదకరమైన మోడీ పాలనకు వ్యతిరేకంగా తక్షణమే రాజకీయంగా జోక్యం చేసుకోవడం. మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం దీనినే స్పష్టం చేస్తుంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తిరోగమనం మాత్రమే కాదు, ఇది భారతీయ సమాజం మొత్తాన్ని విషపూరితం చేస్తున్న స్పష్టమైన నయా ఫాసిస్ట్ ధోరణులను ప్రదర్శిస్తోంది. మోడీ ప్రభుత్వం ఒకదాని తరువాత ఒకటి తీసుకున్న చర్యలు మన రాజ్యాంగ విలువలన్నింటినీ నాశనం చేస్తున్నాయి.

పార్టీ మహాసభ ముగిసిన తర్వాత ఒకేరోజున రెండు ముఖ్యమైన పరిణామాలు జరిగాయి. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను నిరోధించడంలో గవర్నర్ చర్య తప్పు అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని దెబ్బతీస్తోందనే సిపిఎం వైఖరిని ఈ తీర్పు బలపరుస్తుంది. మోడీ ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక దాడిని కొనసాగిస్తోంది. పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు పెంచారు. వంట గ్యాస్ ధరను పెంచారు. ఇవన్నీ సాధారణ ప్రజలపై భారాలు పడుతున్నాయి. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ఉద్యమాన్ని నిర్మించాలంటే సిపిఎం బలాన్ని పదిరెట్లు పెంచాలి. సంస్థాగతంగా, పార్టీ, వర్గ ప్రజా సంఘాల ప్రభావం, సామర్థ్యాన్ని పెంచాలి. దీనికి ఉపయోగపడే అనేక విషయాలను పార్టీ మహాసభ నిర్మాణ నివేదికలో చర్చించాం. మానవులకు జీవ కణాల వలె, పార్టీకి జీవ కణాలైన శాఖలు చాలా ముఖ్యమైనవి. దేశవ్యాప్తంగా దాదాపు లక్ష శాఖలు ఉన్నాయి. శాఖల కార్యకలాపాలను సమన్వయం చేసే స్థానిక కమిటీలు, ఉపకమిటీలు ఉన్నాయి. జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు, కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో ఉన్నాయి. ఈ కమిటీలన్నింటినీ అనేక రెట్లు పెంచాలని పార్టీ మహాసభ నిర్ణయించింది. శాఖలకు అవసరమైన శిక్షణను రాష్ట్ర కమిటీలు నిర్ణయించాలి. కమిటీలు మరింత చురుగ్గా ఉండాలి. వాటి పోరాట సామర్థ్యాన్ని పెంచాలి.

ప్రశ్న : కొత్త తరహా పోరాట నమూనాలను ఎలా తీసుకుంటారు?

బేబి: ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై స్థానికంగా ఆందోళనలను చేపట్టాలి. కన్నూర్ పార్టీ మహాసభలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా, గత మూడేళ్లుగా అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తుతూ బలమైన ఆందోళనలు జరిగాయి. దీర్ఘకాలికంగా సాగే ఇటువంటి పోరాటాలను విజయవంతం చేయడంపై దృష్టి పెట్టాలని మహాసభ నిర్ణయించింది. పంటల బీమా డిమాండ్‌పై రాజస్థాన్‌లో రైతులు చేసిన పోరాటం, ఇళ్లు లేనివారికి ఇళ్ల స్థలాల కోసం డిమాండ్ చేస్తూ తెలంగాణలో జరిగిన ఆందోళన ఇందుకు ఉదాహరణలు. ఇవన్నీ విజయవంతమయ్యాయి. పార్టీ సభ్యులు పనిచేసే చోట ప్రజా సంఘాలు వ్యూహాత్మక కార్యకలాపాలను చేపట్టాలని కన్నూర్ మహాసభలో నిర్ణయించాం. వయనాడ్ కొండచరియల విపత్తు బాధితులకు ఇళ్లు అందించే ప్రాజెక్టులో భాగంగా డివైఎఫ్ఐ కార్యకర్తలు రూ.20.4 కోట్లు సేకరించారు. వ్యర్థ పదార్థాలను సేకరించి విక్రయించి బిర్యానీ ఛాలెంజ్ నిర్వహించారు. ఈ విధంగా సేకరించిన మొత్తాన్ని పార్టీ కేంద్ర కమిటీకి సమర్పించినప్పుడు చాలామందికి ఆశ్చర్యం కలిగింది. ఆందోళనలు, అటువంటి కార్యకలాపాలతో సాధించిన విజయాలను మదురై పార్టీ మహాసభ చర్చించింది. ఇది కొత్త పోరాట నమూనాలను చేపట్టడానికి మాకు స్ఫూర్తినిస్తుందని నేను ఆశిస్తున్నాను. ఆందోళనలను కొత్త స్థాయికి తీసుకెళ్లడమే దీని ఉద్దేశం.

ప్రశ్న : సంఘ్ పరివార్‌ను సైద్ధాంతికంగా, సాంస్కృతికంగా ఎదుర్కోవడానికి ప్రణాళికను ఎలా అమలు చేయాలనుకుంటున్నారు?

బేబి: సంఘ్ పరివార్ ప్రభావం సమాజంలో లోతుగా పాతుకుపోయింది. ఆర్ఎస్ఎస్ అనేక పేర్లతో, వివిధ రూపాల్లో ఉన్న సంస్థల ద్వారా పనిచేస్తుంది. మన దేశంలోని చాలా రాజకీయ పార్టీలు దీనివల్ల కలిగే ముప్పును తీవ్రంగా పరిగణించడానికి ఇష్టపడటం లేదు. కానీ వారందరూ బిజెపిని తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మరో రాజకీయ పార్టీగా చూస్తున్నారు. అందుకే కాంగ్రెస్, ఎస్‌పి వంటి పార్టీలన్నీ బిజెపికి వ్యతిరేకంగా రాజకీయ వైఖరి తీసుకుంటున్నాయి. బిజెపిని కేవలం ఒక రాజకీయ పార్టీగా చూడలేము. సిపిఎం కార్యక్రమంలో పేర్కొన్నట్లుగా, బిజెపి అనేది ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ నియంత్రణలో పనిచేస్తున్న ఒక రాజకీయ పార్టీ. ఆర్ఎస్ఎస్ ప్రణాళికను సాకారం చేయడానికి ఏర్పడింది. దేశంలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు ఈ కోణంలో చూడకపోవడం వల్ల సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కూడా పరిమితులు ఏర్పడుతున్నాయి. విస్తృత మిగతా 7లో

మద్దతు ధరపై బోనస్

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై 'బోనస్' ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ఒంగోలు సుందరయ్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు మాట్లాడారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు మిర్చి రూ.12 వేలు కొనుగోలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.11,780 'మద్దతు ధర' ప్రకటించడం పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ఇప్పటివరకూ అమలు చేయలేదని, ఖరీఫ్ సీజన్ వస్తున్నా ప్రభుత్వం 'పంటల బీమా' అమలు చేయకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పంటల గిట్టుబాటు ధరల కోసం 15న కోకో రైతులు, పొగాకు, మిర్చి రైతులు 16న గుంటూరులో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ.. కౌలు రైతులందరికీ బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపిడిఒలకు తాత్కాలిక ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్‌శాఖలోని ఆరుగురు ఎంపిడిఒలకు డిఎల్‌డిఒలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ అందించిన ప్రతిపాదనల ప్రకారం గుంటూరు జిల్లాకు చెందిన వై హనుమ రెడ్డి, కృష్ణా జిల్లాలో జి రాణి, జి అరుంధతి దేవి, తూర్పుగోదావరి జిల్లాలో ఎస్ బొజ్జి, డి రాంబాబు, విజయనగరం జిల్లాలో ఎస్ రవీంద్రకు డిఎల్‌డిఒలుగా తాత్కాలిక ఉద్యోగోన్నతులు కల్పించారు. గతంలో కల్పించిన ఉద్యోగోన్నతుల సమయంలో వీరిపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉండటంతో కల్పించలేదని, ప్రస్తుతం కేసులు ఎత్తివేయడంతో తాజాగా ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఫోరెన్సిక్ సైన్సెస్ గౌరవ సలహాదారుగా కెపిసి గాంధీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫోరెన్సిక్ సైన్సెస్ గౌరవ సలహాదారుగా డాక్టర్ కెపిసి గాంధీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం జిఓఆర్‌టి నెంబరు 702ను విడుదల చేసింది. గాంధీ రాష్ట్ర ఫోరెన్సిక్ సైంటిస్ట్, ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఈ పదవిలో రెండేళ్లపాటు కేబినెట్ ర్యాంక్ హోదాలో కొనసాగనున్నారు.

మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్

- పిఆర్‌టియు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిఆర్‌టియు డిమాండ్ చేసింది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఉపాధ్యాయులు అవకాశం ఉన్నా కోరుకున్న చోటికి పోలేకపోతున్నారని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, ఎఎం గిరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ బదిలీలు నిర్వహిస్తే ఉపాధ్యాయులు ఆప్షన్లు అనేకం ఇవ్వాలని, దీనివల్ల ఏ స్కూల్‌కు వెళ్తారో తెలియక సతమతమయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిఎం చంద్రబాబు గతంలో తీసుకొచ్చిన మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ భవిష్యత్ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

అనుచిత పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు

- వైఎస్ షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోషల్ మీడియా వేదికగా అనుచిత పోస్టులు, వ్యాఖ్యలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ దారుణ సంస్కృతిని వెలివేయడానికి అన్ని పార్టీలూ ముందుకు రావాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. భారతిరెడ్డిపై సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని తెలిపారు. ఇటువంటి నీచపు కామెంట్స్ తీవ్రవాదంతో సమానమని పేర్కొన్నారు. తప్పుడు కూతలు కూసిన వారిపై, రేటింగ్స్ కోసం ఎంటర్‌టైన్ చేసే యూట్యూబ్ ఛానెళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విష సంస్కృతికి బీజం వేసింది వైసిపి, టిడిపిలేనని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పోస్టులు పెట్టే సైతాన్ సైన్యానికి ఈ రెండు పార్టీలే ఆదర్శమన్నారు.

ఇళ్లు కట్టించాకే ఓట్లు అడుగుతాం

- ఐదేళ్లలో గ్రామాల్లో మూడు సెంట్లు జాగా ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం
- సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే సహించం
- ఆగిరిపల్లి పి-4 ప్రజావేదిక సభలో సిఎం చంద్రబాబు



బంగారు కుటుంబానికి ఎన్నికైన లక్ష్మీదుర్గతో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇళ్లు లేని వారందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు స్థలమిచ్చి ఇళ్లు కట్టించిన తర్వాతే ఓట్లు అడగడానికి వస్తామని, ఇందులో ఎవరికీ అనుమానం అవసరం లేదని, అందరికీ ఇళ్లు కట్టే కార్యక్రమం పెద్దఎత్తున చేపడతామని, గత ప్రభుత్వం నివాసానికి అనుకూలంగా లేని చోట స్థలాలిచ్చి మోసగించిందని సిఎం చంద్రబాబు అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి సచివాలయం-2 పరిధిలో శుక్రవారం పి-4 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా కుల వృత్తులు చేసుకుంటున్న కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డుకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం పి-4 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మాట్లాడుతూ..పూలే జయంతి రోజున పి-4 కార్యక్రమం ప్రారంభించుకుంటున్నామన్నారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు పెంచుతామని, నామినేటెడ్ పోస్టుల్లో 33 శాతం అమలు చేస్తామని తెలిపారు. నేరస్తులకు సోషల్ మీడియా అడ్డాగా మారిందని, ఎవరి వ్యక్తిత్వాన్ని కించపరిచినా వాళ్లకు అదే చివరిరోజు అవుతుందని హెచ్చరించారు. సమాజంలో ఉన్నతస్థానంలో ఉన్న పది శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను పైకి తీసుకొచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. తయారవుతారన్నారు. ఆగిరిపల్లిలోని 206 కుటుంబాలకు వారి మార్గదర్శకులు అండగా ఉంటారని తెలిపారు. రాష్ట్రంలో మొదటిదశలో 20 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి పైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. బంగారు కుటుంబాలకు ఎంపికైన ప్యారీ రేష్మ, బోనం లక్ష్మీదుర్గ మాట్లాడారు. బంగారు కుటుంబాలకు సాయం చేసేందుకు వచ్చిన మార్గదర్శకులు నూజివీడు అధినేత ప్రభాకర్, హ్యాపీవ్యాలీ స్కూల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, కుశలవ గ్రూప్‌కు చెందిన సిద్ధార్థ, నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ అధినేత నితిన్ కృష్ణ, మోడల్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పిన్నమేని ధనప్రకాష్, ఎన్‌ఆర్‌ఐ కాలేజీ ఛైర్మన్ రావి వెంకట్రావు మాట్లాడుతూ... నిరుపేద కుటుంబాలకు అండగా ఉండి పైకి తీసుకొస్తామన్నారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సిఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సిఎంను కలిసిన కోకో రైతులు

కోకోపంటకు సరైన ధరలేక ఇబ్బంది పడుతున్న రైతులు సిఎంను కలిసేందుకు రాగా పోలీసులు అనుమతించలేదు. దీంతో సభ ముగిసిన తర్వాత ఎంపి పుట్టా మహేష్ రైతులను కలిసి వారితో మాట్లాడి, సిఎం వద్దకు తీసుకువెళ్లారు. సిఎంకు కోకో రైతులు తమ సమస్యను వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సిఎం వారికి హామీ ఇచ్చారు.

4న విశాఖలో మేడే సాంస్కృతికోత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మే 4న సాంస్కృతికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జ్ జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ సాంస్కృతికోత్సవాల్లో నగరంలోని సంఘటిత రంగ, అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. పాల్గొనే వారు సామాజిక న్యాయం, మహిళా సాధికారికత, సమైక్యత, సమానత్వం, దేశభక్తి, వంటి అంశాలపైగానీ, అభ్యుదయ భావాలు కలిగిన కళారూపాలనుగానీ ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న వారు, జివిఎంసి, స్కీం వర్కర్లు, ఉపాధ్యాయులు కళారూపాలు ప్రదర్శించడానికి ముందుకొచ్చారని తెలిపారు. విజయ శ్రీ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ కెవి.విజయవేణి మాట్లాడుతూ నగరంలోని డ్యాన్స్ అకాడమీలకు చెందిన బృందాలు కూడా ఈ ఉత్సవంలో పాల్గొంటాయని, శ్రామిక గీతాలకు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శిస్తాయని తెలిపారు. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పాల్గొనే వ్యక్తులు, బృందాల పేర్లను ఈ నెల 20లోగా పంపాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ సభ్యులు బుజ్జి, ఎం.ఎల్లాజీ, డాక్టర్ కె.పద్మ, సతీష్, సత్యనారాయణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం తీసుకొచ్చిన 'పూలే'

- జయంతి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల్లో చైతన్యం తీసుకొచ్చిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. పూలే జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై మొట్టమొదటిగా గళమెత్తిన వ్యక్తి పూలే అని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో అసమానతలను తొలగించవచ్చని పూలే భావించి కొంతమందికే పరిమితమైన విద్యను అందరికీ అందించాలనే లక్ష్యంతో అనేకమందిని చైతన్యపరిచారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్ వంటి అనేక మంది సంఘ సంస్కర్తలు పూలే ఆలోచన విధానాన్ని ప్రసంశించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, పి అశోక్‌బాబు మాట్లాడారు.

టిటిడి ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు : బుచ్చి రాంప్రసాద్

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ప్రతిష్టను దిగజార్చేందుకు వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారని టిడిపి బ్రాహ్మణ సాధికార సమతి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాటకు కారణమైన హరినాథ్ రెడ్డిని కాపాడాలని వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి కుట్రలకు తెరలేపారని పేర్కొన్నారు. పొనమనూరు నుంచి వచ్చిన ఒక్క ఆవు మాత్రమే అనారోగ్యంతో మృత్యువాత పడినట్లు తెలిపారు.

'ఉక్కు' కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపండి

సిఐటియు ప్రధానకార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. కార్మకుల తొలగింపులను వ్యతిరేకిస్తూ ఈ నెల 16 నుంచి కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె జరుగుతుందని తెలిపారు. విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో గత మూడు మాసాల్లో మూడు వేల మందికిపైగా కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగించిందన్నారు. గత నెలలో 1213 మంది పర్మినెంట్ ఉద్యోగులను, ఆఫీసర్లను విఆర్‌ఎస్ పేరిట బయటకు పంపారన్నారు. నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను గత ఏడాది అక్టోబర్ 1న ఒకే రోజు తొలగించాలని నిర్ణయించి, శాంతిభద్రతల సమస్యలకు భయపడి వెనక్కు తగ్గారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు నైపుణ్యంతో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వారిని తొలగిస్తే ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిపారు. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పిస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న ఉద్యోగులను తొలగించడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్మికుల తొలగింపు వెంటనే ఆపేలా విశాఖ ఎంపి, గాజువాక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని, ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా డిఎల్.పురం, రాజయ్యపేట, బోయపాడు, అమలాపురం, బంగారమ్మపేట, పెంటకోట గ్రామాల పక్కన ఉన్న 2.9 కిలోమీటర్ల పొడవు సముద్ర ప్రాంతాన్ని ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌కు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సముద్రతీరాన్ని ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టే విధానం దేశ ప్రయోజనాలకు హానికరమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత పోర్టు కోసం కేటాయించిన రెండు వేల ఎకరాల భూమిని, గంగవరం సముద్రతీరాన్ని ఆనాటి టిడిపి ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యాలకు అప్పగించిందని, ఇప్పుడు అది అదానీపరమైందని తెలిపారు. ఫలితంగా మత్స్యకారులు పూర్తిగా నష్టపోయారన్నారు. గంగవరం పోర్టులోని 300 మంది మత్స్యకారులను ఇటీవల తొలగించారని తెలిపారు. క్యాప్టివ్ పోర్టును ప్రైవేట్ యాజమాన్యాలకు కట్టబెడితే మాదకద్రవ్యాలు, స్మగ్లింగ్ కార్యక్రమాలు పెరుగుతాయని హెచ్చరించారు. మిట్టల్ యాజమాన్యం విశాఖపట్నం పోర్టును, గంగవరం పోర్టును ఉపయోగించుకోవచ్చని తెలిపారు. సముద్రతీరాన్ని వారికి ఇవ్వడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మీడియా సమావేశంలో సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.


సమైక్యతా శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.విజయరావు,వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిహెచ్.బాబురావు తదితరులు

మత సామరస్యం కోరుతూ 13న సమైక్యతా శంఖారావం

ప్రజాశక్తి - విజయవాడ

లౌకిక రాజ్యాంగ హక్కుల్ని పరిరక్షించాలని కోరుతూ సొసైటీ ఫర్ కమ్యునల్ హార్మోనీ ఆధ్వర్యాన ఈ నెల 13న సమైక్యతా శంఖారావం నిర్వహించనున్నట్లు సొసైటీ ఫర్ కమ్యునల్ హార్మోనీ జాతీయ కమిటీ ఛైర్మన్ కె.విజయరావు, రాష్ట్ర సమన్వయకర్త, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో జరిగే సమైక్యతా శంఖారావం సదస్సు పోస్టర్‌ను నగరంలోని బాలోత్సవ భవన్‌లో వారు శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. భిన్నమతాలు, జాతులు, భాషలు, వర్గాలు, సంస్కృతుల సమాహారంగా ఉన్న మనదేశంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణలు సృష్టించే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రజలందరి ఆమోదం లేకుండా వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంట్‌లో ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. పాలకులే మతం, భక్తి పేరుతో రోజుకోమాట చెబుతున్నారని, వాటికి ప్రత్యామ్నాయంగా ఈ సదస్సు జరుగుతోందని తెలిపారు.

అనంతపురం, కర్నూలులో అకాల వర్షం

- పలు పంటలు నష్టం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి, కర్నూలు


అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో గురువారం రాత్రి అకాల వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో గాలివానకు 2807 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో 1628 ఎకరాల్లో మొక్కజొన్న, 946 ఎకరాల్లో వరి, 232 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. వీటితో పాటు బొప్పాయి, అరటి, మామిడి తదితర ఉద్యాన పంటలకూ నష్టం వాట్లింది.కర్నూలు జిల్లాలోని ఎనిమిది మండలాల్లో, నంద్యాల జిల్లాలోని 19 మండలాల్లో వర్షం కురిసింది. మహానంది మండలంలోని పలు గ్రామాల్లో గాలి వానకు వెయ్యి ఎకరాల్లో వరి పంట నేలవాలింది.

విద్యుత్ రంగ సమస్యలపై 12న సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ రంగ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశాఖ అల్లూరు విజ్ఞాన కేంద్రంలో 12న జరిగే సదస్సును విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె రాజశేఖర్ కోరారు. విజయనగరంలోని విద్యుత్ భవనంతో పాటు పలు సబ్‌స్టేషన్లలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు, షిఫ్ట్ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర విభాగాలకు చెందిన కార్మికులతో కలిసి శుక్రవారం ఆయన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 2022 పిఆర్‌సి ఎరియర్స్ తక్షణమే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలిడేస్ చెల్లించాలని, విడిఎలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పదేళ్ల ఇన్సెంటివ్ ఇవ్వాలని తదితర ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ సదస్సు జరుగుతుందన్నారు. అనంతరం సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి అప్పలసూరి, జిల్లా కార్యదర్శి ఎ జగన్మోహన్‌రావు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

బంగారు వ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడిపత్రి

బంగారం కొనుగోలు విషయంలో అకారణంగా నిందితున్ని చేసి పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారన్న అవమాన భారాన్ని భరించలేక పోలీసు స్టేషన్ ఎదుట సైనెడ్ మింగి బంగారు నగల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు...అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం మెయిన్ బజార్‌లో బర్కత్ జ్యువెల్లరీ షాపును ఎన్.చిన్న గౌసుల్లా (50) నిర్వహిస్తున్నారు. తాడిపత్రికి చెందిన జిలాన్ అనే వ్యక్తి ముత్తూట్ ఫైనాన్స్‌లో అడ్వయిజర్‌గా పని చేస్తుండేవాడు. ఈ సమయంలో పూల హాజి అనే వ్యక్తి పది తులాల బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో జిలాన్ సహాయంతో తాకట్టు పెట్టాడు. పూల హాజికి తెలియకుండా అతని బంగారాన్ని జిలాన్ విడిపించి, బంగారు వ్యాపారి గౌసుల్లాకు విక్రయించాడు. దీంతో పూలహాజి గౌసుల్లా ఇంటి వద్దకు వెళ్లి తన బంగారం అమ్మిన విషయంపై ఆరా తీశాడు. తనకు నాలుగు తులాలు మాత్రమే అమ్మాడని గౌసుల్లా చెప్పడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో పోలీసులు మూడు రోజుల క్రితం గౌసుల్లాని పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. శుక్రవారం కూడా మరోసారి విచారించారు. తనను అకారణంగా పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుతూ అవమానిస్తున్నారని భావించి విచారణ అనంతరం స్టేషన్ బయటకు వచ్చి సైనెడ్ మింగారు. పోలీసులు వెంటనే ఆయన్ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పూలే స్ఫూర్తితో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

- స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



మహాత్మా జ్యోతిరావు పూలే పోరాట స్ఫూర్తితో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామని స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1521వ రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ పోరాటానికి ఒబిసి అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలిపి ఉద్యమంలో పాల్గొంటోందన్నారు. త్యాగాలతో సాధించుకున్న కర్మాగారాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఖండించారు. ప్లాంట్‌ను రక్షించుకోవడానికి ఎంతటి పోరాటానికైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

- ఎపిఎస్ ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్‌ఇ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. తాడేపల్లిలోని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయంలో, కమిషనర్ విఆర్ కృష్ణతేజను జెఎసి ఛైర్మన్ ఎం రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి డి శేషు తదితర నాయకులు శుక్రవారం కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా 2016 సర్క్యులర్ ప్రకారం జెఇ, టిఎ, ఇతర కేడర్‌ల సిబ్బందికి గ్రేడ్స్ ఫిక్సేషన్ జరగలేదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల దృష్ట్యా ఆరేళ్ల నుంచి సిబ్బందికి జీతాలు పెంచనందున పిఆర్‌సి 23 శాతం అమలు చేయాలని కోరారు. సిబ్బందికి గ్రాట్యూటీ అమలు చేయాలని, సీనియారిటీ ప్రకారం విద్యార్హతల ఆధారంగా ఖాళీగా ఉన్న పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. అవుట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులను ఎఫ్‌టిఇలుగా కన్వర్ట్ చేయాలని, 2018లో ఒఎస్ నుంచి ఎఫ్‌టిఇలుగా కన్వర్ట్ అయిన సిబ్బంది సర్వీసుకు అనుగుణంగా ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఇతర సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు.

టిటిడి ప్రతిష్టను దెబ్బతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- మాజీ ఛైర్మన్ భూమన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను టిడిపి కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందని, మూడు నెలల కాలంలో గోశాలలో వంద గోవులు మృత్యువాత పడ్డాయని, దీనిపై విచారణ జరపాలని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మీడియాతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాలనలో దాతల సహకారంతో 500 గోవులను గోశాలకు తీసుకొచ్చామని, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. వాటికి ఆహారం సరిగ్గా లేక గోవులతో పాటు, లేగదూడలు మృతి చెందాయని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటివరకూ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. దీనిపి టిటిడి వివరణ ఇస్తూ గోశాలలో గోవులు వందకు పైగా మరణించాయని కొంతమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం అవాస్తవమని తెలిపింది. దురుద్దేశంతో కొంతమంది ఎక్కడో మృతి చెందిన గోవులు గోశాలలో మృతి చెందాయని చూపడం వల్ల యాత్రికుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు. ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేయొద్దని టిటిడి కోరింది.

గోవుల మృతిపై విచారణ జరిపించాలి : సిపిఎం


టిటిడి గోశాలలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ సంఖ్యలో గోవులు మృతి చెందాయని వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు ఓ ప్రకటనలో కోరారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని అవాస్తవమని టిటిడి పేర్కొంతుందని, వాటిపై సమగ్ర విచారణ జరిపి యాత్రికులకు నిజానిజాలు తెలపాలని కోరారు.

చంద్రబాబువే అసలైన డ్రామాలు

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు చంద్రబాబు తనకు భద్రత కల్పించాలంటూ, ఆడినవే అసలైన డ్రామాలు అని మాజీ మంత్రి, వైసిపి నాయకులు పేర్ని నాని విమర్శించారు. రామగిరిలో జగన్‌కు భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'అవన్నీ అనంతపురం డ్రామాలు...' అన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దానిని విస్మరించడం వల్లే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. రెక్కలు తిరుగుతుండగానే హెలికాప్టర్ వద్దకు జనం ఎలా వెళ్లారని, వారిని నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా? అని ప్రశ్నించారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే తొపుదుర్తి ప్రకాశ్ ఉద్దేశపూర్వకంగా జనాన్ని రెచ్చగొట్టి, డిఎస్‌పి నిలువరిస్తున్నా వినకుండా జనాన్ని ప్రోత్సహించి హెలికాప్టర్ విండ్ షీల్డ్ పగులకొట్టించారంటూ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. రామగిరిలో హెలిప్యాడ్ రక్షణ కోసం వైసిపి కార్యకర్తలు రెండంచెల బారికేట్స్ కట్టుకున్నా, ఎఫ్‌ఐఆర్‌లో బారికేట్స్ లేవని రాసినట్లు తెలిపారు. జగన్‌కు భద్రతపై కేంద్రం బాధ్యత తీసుకోవాలని కోరారు. గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అవినీతికి అంతు లేకుండా పోతోందని, అందుకే ఒఎస్‌డిని ప్రభుత్వం తొలగించిందన్నారు. ఈ శాఖలో కీలకంగా ఉన్న మరో ఐఎఎస్ అధికారి సెలవుపై వెళ్లారని పేర్కొన్నారు.


యువకుని మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

మద్యానికి బానిసై యువకుడు మృతి

- బెల్ట్‌షాపులు తొలగించాలని గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి (ఏలూరు జిల్లా)

మద్యానికి బానిసై అనారోగ్యం పాలైన యువకుడు మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పాలచర్ల రాజవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాకాని వంశీ (24) ఇటీవల కాలంలో మద్యానికి బానిసై బెల్ట్‌షాపుల వద్ద ఫుల్‌గా మద్యం తాగుతూ అనారోగ్యానికి గురయ్యారు. గురువారం రాత్రి మద్యం తాగి పడుకున్న వంశీకి అకస్మాత్తుగా కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటీన జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఇటీవల కాలంలో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయడంతో పలువురు యువకులు పనికి వెళ్లకుండా మద్యానికి బానిసలవుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశీ మృతదేహంతో జీలుగుమిల్లి - మక్కినవారిగూడెం రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని నినదించారు. ఘటనా స్థలానికి పోలీసులు, టిడిపి కూటమి పార్టీ నాయకులు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి గ్రామంలో బెల్ట్‌షాపులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఓ ఇంటి వద్ద ఉన్న మద్యం సీసాలను పగలగొట్టించారు. దీంతో ఆందోళనకారులు శాంతించి వంశీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

గూగుల్‌లో వందలాది మందికి ఉద్వాసన

వాషింగ్టన్ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ మరోమారు ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈసారి ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్ టీమ్‌ల నుంచి వందలాది మంది ఉద్యోగులను తొలిగించేస్తోందని సమాచారం. ఇప్పటికే వీరికి నోటీసులు కూడా పంపినట్లు రిపోర్టులు వస్తున్నాయి.
ఆపరేషన్‌లను స్ట్రీమ్‌లైన్ చేయడం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధిక వృద్ధి రంగాలలో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం కోసమే ఉద్వాసనలు చేపడుతోందని పరిశ్రమ వర్గాల అంచనా. మరోవైపు ఆర్థిక అనిశ్చితులు, ఎఐ ప్రాజెక్టుల వ్యయం పెరగడం కూడా కారణమని తెలుస్తోంది.


ఎస్‌ఐపిల్లో తగ్గిన పెట్టుబడులు

ముంబయి : ఈ ఏడాది మార్చిలో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్‌ఐపి) పెట్టుబడుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2025 ఫిబ్రవరిలో రూ.25,999 కోట్లుగా ఉన్న పెట్టుబడులు.. మార్చిలో స్వల్పంగా 0.28 శాతం తగ్గి రూ.25,926 కోట్లుగా నమోదయ్యాయి. అయినప్పటికీ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ మొత్తం ఎయుఎం 23.11 శాతం వృద్ధితో రూ. 65.74 లక్షల కోట్లకు చేరిందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్‌ఐ) తెలిపింది.

రిటైల్ పెట్టుబడిదారులలో అవగాహన పెరగడం, మ్యూచువల్ ఫండ్లపై నమ్మకంతో ఎయుఎం పెరిగడానికి కారణమని ఎఎంఎఫ్‌ఐ సిఇఒ వెంకట్ చలసాని పేర్కొన్నారు.

పెగాసస్ నిఘా భారత్@100

- మొదటి స్థానంలో మెక్సికో
- ప్రపంచవ్యాప్తంగా 51 దేశాల్లో బాధితులు



న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ స్పైవేర్ పెగాసస్ బారిన పడిన వారు ఒక్క భారతదేశంలోనే వందమంది ఉన్నట్లు తేలింది. 2019వ సంవత్సరంలో చోటుచేసుకున్న వాట్సప్ హ్యాకింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా 1223 మందిని లక్ష్యంగా చేసుకోగా వారిలో 100 మంది భారతదేశంలో ఉన్నట్లు తాజాగా 'మీడియా నామా' సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. యుఎస్ కోర్టులో జరుగుతుతన్న న్యాయపరమైన పోరాటాన్ని ఉటంకిస్తూ ఈ కథనం ప్రచురణ కావడం చర్చనీయాంశంగా మారింది పెగాసస్‌ను తయారు చేసే ఇజ్రాయెల్ ఎన్‌ఎస్‌ఓ గ్రూపు టెక్నాలజీస్, 'మెటా'కు చెందిన వాట్సప్ మధ్య అమెరికా న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా తాజాగా దాఖలైన అఫిడవిట్ ప్రకారం ఈ సంఖ్యను ఆ సంస్థ నిర్ధారించింది. ఏప్రిల్ 2019 నుంచి మే 2019 మధ్య రెండు వారాల వ్యవధిలో 1400 మంది వాట్సప్ వినియోగదారులపై ఎన్‌ఎస్‌ఓ గ్రూపునకు చెందిన స్పైవేర్ ఉపయోగించబడిందని 'వాట్సప్' ఆరోపించింది. రెండు వారాల వ్యవధిలో పెగాసస్ ఉపయోగించి లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల సంఖ్యను దేశాలవారీగా వాట్సప్ జాబితా చేసింది. పెగాసస్ బాధిత వాట్సప్ వినియోగదారులు ప్రపంచవ్యాప్తంగా 51 దేశాలలో ఉన్నారు. ఈ జాబితాల్లో మెక్సికో ముందున్నది. 456 మందిని ఎన్‌ఎస్‌ఓ పెగాసస్ టార్గెట్‌గా చేసుకున్నది. ఆ తర్వాతి స్థానంలో భారత్ ఉన్నది. ఈ టార్గెట్‌లో భారత్ నుంచి వంద మంది ఉన్నారు. భారత్ తర్వాత.. బహ్రెయిన్ (82), మొరాకో (69), పాకిస్థాన్ (58), ఇండోనేషియా (54)లు ఉన్నాయి. ఇక టర్కీ నుంచి 26 మంది, స్పెయిన్ నుంచి 21 మంది, ఫ్రాన్స్ నుంచి ఏడుగురిని ఈ స్పైవేర్ ద్వారా టార్గెట్ చేశారు. అయితే, 2019 వాట్సప్ హ్యాకింగ్ ప్రచారంలో లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల వివరాలు మాత్రం అస్పష్టంగా ఉన్నాయి. అయితే, మెటా వాదనలను ఎన్‌ఎస్‌ఓ తోసిపుచ్చినట్టు ఇజ్రాయెల్ వార్త సంస్థ ఒకటి వివరించింది.

2021 జులైలో 17 మీడియా సంస్థల బృందం, మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జరిపిన దర్యాప్తులో.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులపై అనధికారిక నిఘా కోసం పెగాసస్‌ను ఉపయోగిస్తున్నట్టు తేలింది. భారత్‌లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ వంటి వారు టార్గెట్ జాబితాలో ఉన్నట్టు ఇప్పటికే వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. భారత్‌లో అక్రమ నిఘా సాధ్యం కాదని అప్పటి కేంద్ర సమాచార సాంకేతిక మంత్రి వైష్ణవ్ 2021 జులైలో పార్లమెంటులో తెలిపారు. అయితే, ఆరోపణలపై సుప్రీంకోర్టు ఒక నిపుణుల కమిటీని ఏర్పర్చింది. 2022 ఆగస్టులో ఈ ప్యానెల్.. 29 ఫోన్లకు గానూ ఐదింటిలో మాల్వేర్‌ను గుర్తించిందని కోర్టు వివరించింది. ఈ విచారణకు మోడీ ప్రభుత్వం నుండి సహకారం లభించని విషయం తెలిసిందే.

గోరంట్ల మాధవ్‌కు రిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న అభియోగంపై మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌కు గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు శుక్రవారం రిమాండ్ విధించింది. వైఎస్ భారతిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను గుంటూరుకు తీసుకువస్తుండగా మంగళగిరి నుంచి పోలీసు వాహనాన్ని అనుసరించిన మాధవ్ బృందం స్థానిక చుట్టుగుంట వద్ద దాడికి పాల్పడ్డారని ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో మాధవ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. మాధవ్‌తో పాటు సత్యసాయి, అనంతపురం జిల్లాకు చెందిన చిగండి.రమేష్, తాళ్ల దామోదర్, దిగివింటి శివ ప్రసాద్, చిదగొండ్ల శివయ్య, గౌళ్ళ సురేందర్‌లను కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి 14 రోజులు రిమాండ్ విధించింది.

వీరిని నెల్లూరు జైలుకు తరలించారు. అంతకు ముందు జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశానికి నిందితులను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాధవ్‌కు పోలీసులు ముసుగు వేసేందుకు ప్రయత్నించగా ఆయన అడ్డుకున్నారు. మీడియా సమావేశానికి వచ్చేందుకు మాధవ్ నిరాకరించారు. మాధవ్ లేకుండా మిగతా ఐదుగురు నిందితులను మీడియా ముందు హాజరుపర్చారు.

కాగా చేబ్రోలు కిరణ్‌కుమార్‌కు మంగళగిరి కోర్టు శుక్రవారం 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను గురువారం మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేయగా శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'పేట' బస్సు దగ్ధం కేసు ముద్దాయి క్షమాభిక్ష దరఖాస్తును పరిగణనలోకి తీసుకోండి

- రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

పాతికేళ్ల క్రితం చిలకలూరిపేటలో జరిగిన బస్సు దహన కేసులో యావజ్జీవ జైలుశిక్ష అనుభవిస్తున్న సాలూరి చలపతిరావు అనే ముద్దాయి చేసుకున్న క్షమాభిక్ష, పెరోల్ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. చలపతిరావుకు విధించిన ఉరిశిక్షను యావజ్జీవంగా మారుస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసేనాటికి అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం క్షమాభిక్ష, పెరోల్ అంశాలపై నిర్ణయం తీసుకోవాలని జైళ్లశాఖ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసింది. చలపతిరావు జైలులో సత్ప్రవర్తనతో ఉన్నారో లేదో అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని జైళ్లశాఖ డిజిని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 మార్చి 8వ తేదీన హైదరాబాద్ నుంచి చిలకలూరిపేట వెళుతున్న ఆర్‌టిసి బస్సులోని ప్రయాణికులను దోచుకోవాలనే ఉద్దేశంతో చలపతిరావు, జి విజయవర్ధన్‌రావు బస్సుకు నిప్పుపెట్టడంతో 23 మంది ప్రయాణికులు మరణించారు. ఈ కేసులో వాళ్లిద్దరికీ గుంటూరు కోర్టు 1995 సెప్టెంబర్ 7న ఉరిశిక్షను విధించగా, హైకోర్టు కూడా సమర్థించింది. 1996 ఆగస్టు 28న సుప్రీంకోర్టు కూడా ఆమోదించింది. కేంద్ర మాజీ మంత్రి జార్జిఫెర్నాండెజ్ జోక్యం చేసుకోవడంతో క్షమాభిక్ష దరఖాస్తు రాష్ట్రపతికి పంపారు. ఆనాటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ తిరస్కరించారు. 1997 మార్చి 28న ఒక కార్యక్రమంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత మహాశ్వేతాదేవి ఆ ఇద్దరికీ క్షమాభిక్ష ప్రసాదించాలని రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అదే రాత్రి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పెషల్ బెంచ్ ఏర్పాటు చేశారు. క్షమాభిక్ష వినతిపత్రం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పి ఉరిశిక్షపై స్టే విధించింది. ఆ తర్వాత రాష్ట్రపతి అయిన కెఆర్ నారాయణన్ ఆ ఇద్దరికీ విధించిన ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా తగ్గింపునకు ఆమోదం చెప్పారు. తన తండ్రి చలపతిరావు విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన కుమార్తె స్వప్న 2018లో హైకోర్టును ఆశ్రయించారు. 20 ఏళ్లకుపైగా జైల్లోనే ఉన్నందున విడుదల చేయాలని కోరారు దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం యావజ్జీవ శిక్ష అంటే జీవితాంతమని చెప్పింది. అయితే క్షమాభిక్ష, పెరోల్ కోసం దరఖాస్తు చేసుకునే నిర్ణయాన్ని చలపతిరావుకు వదిలేసింది.

సంపాదకీయం

పన్ను భారాలు


ఏప్రిల్ 1వ తేదీ నుండి పట్టణాలు, నగరాల్లో ఆస్తి పన్ను 15 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులీయడం దారుణం. తాజాగా కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరతోపాటు అన్ని నిత్యావసరాల ధరల పెరుగుదలతో జనం సతమతమవుతున్నారు. దేశంలో దాదాపు 80 శాతం మందికి కొనుగోలు శక్తి లేదని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఇటువంటి నేపథ్యంలో ప్రజలపై మరింతగా భారాన్ని పెంచడం సరి కాదు. అంతేగాక ఇప్పుడున్న ఆస్తి పన్ను విధానామే అన్యాయమైనది. ఆస్తి విలువ ప్రాతిపదికగా పన్ను నిర్ధారించే విధానమే సరి కాదు. అదనంగా అప్పులు చేసుకోవడానికి అనుమతించాలంటే పట్టణ సంస్కరణలు, విద్యుత్ సంస్కరణలు చేపట్టి ప్రజలపై భారాలు వేయాలని కేంద్రంలోని బిజెపి సర్కారు జారీ చేసిన హుకుం ప్రకారం వైసిపి ప్రభుత్వం ఈ విధానాన్ని తెచ్చింది. ఆస్తి విలువ ఆధారిత పన్ను ప్రవేశ పెడుతూ గత ప్రభుత్వం 44/2020 చట్టం, జీవో నెంబర్ 198 తీసుకొచ్చింది. విద్యుత్ చార్జీల పెంపు, భూమి హక్కుల గందరగోళం వంటి చర్యలతోపాటు నిర్హేతుకమైన విధానంతో తమ నెత్తిన పెను భారాన్ని వేసిందని ఆ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిన సంగతి అందరికీ తెలుసు. ఆ వాతావరణంలోనే టిడిపి-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజాగళం 6వ పేజీలో 'చెత్త పన్ను రద్దు, ఇంటి పన్ను సమీక్ష' అని హామీనిచ్చారు. టిడిపి కూటమి అధికారానికొచ్చిన ఆరు నెలలు దాటాక చెత్త పన్ను రద్దు చేశారు కానీ ఇంటి పన్ను ఊసెత్తలేదు. కానీ ఇటీవల గుట్టు చప్పుడు కాకుండా 15 శాతం పన్ను పెంచుతూ ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల హామీ ప్రకారం ఇంటిపన్ను తగ్గిస్తారని జనం భావిస్తే ఏలినవారు మరింత వడ్డించడం దారుణం.

రాష్ట్రంలో 124 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏడాదికి రూ.1200 కోట్లుగా ఉన్న ఆస్తిపన్ను డిమాండ్ ఇప్పుడు రూ.2150 కోట్లకు చేరింది. ఈ సంవత్సరం రూ.320 కోట్ల అదనపు భారం పడినందున అది దాదాపు రూ.2500 కోట్లకు చేరువయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం కేటాయింపుల ద్వారాను, ఇతర రూపాల్లో స్థానిక సంస్థలకు నిధులిచ్చి అభివృద్ధి చేపట్టాల్సింది పోయి ప్రజలపై పన్నులు పెంచి పీల్చి పిప్పిచేయడం అన్యాయం. పన్నుల పెంపు భారం ప్రభావం ప్రత్యక్షంగా ఇంటి యజమానులపై పడడమేగాక, పరోక్షంగా అద్దెదారులపై కూడా పడుతుంది. సొంతిల్లు ఉన్నవారికి పన్ను పోటు ఒకటైతే అద్దెకున్న వారికి దాంతోపాటు సొంతిల్లు లేదే అన్న బాధ కూడా అదనం. గృహస్తుల సంగతి అలా వుండగా చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలదారులపైనా భారం పడుతుంది. అది కూడా మళ్లీ పరోక్షంగా పడేది ప్రజలపైనే! అంతేగాక పులి మీద పుట్రలా పన్ను చెల్లింపు ఒక నెల ఆలస్యమైనా 24 శాతం వడ్డీ వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులీయడం అమానుషం. కనీసం మే ఆఖరు వరకయినా జరిమానా లేకుండా ఆస్తిపన్ను బకాయిలు చెల్లించే అవకాశం కల్పించాలని జనం కోరుతున్నది సబబైనది.

వైసిపి పాలనలో జరిగిన విధ్వంసాన్ని సరి చేస్తామని అధికారానికి వచ్చిన టిడిపి కూటమి అవే విధానాలను అనుసరించడం శోచనీయం. ఆ పార్టీని, దాని నాయకుడ్ని విమర్శించి విధానాలు మాత్రం వారివే అనుసరిస్తే ప్రజలు అర్థం చేసుకోలేనంత అమాయకులు కారు. తమ మేనిఫెస్టోలో పేర్కొనడమేగాక ఎన్నికల సభల్లో నాయకులిచ్చిన హామీ మేరకు ఆస్తి పన్నును టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించాలని ప్రజలు కోరడం న్యాయమైనది. అలా చేయకుండా మరో 15 శాతం పన్ను పెంచడం పుండు మీద కారం చల్లడం వంటిది. ఈ నేపథ్యంలో పెంచిన ఆస్తి పన్నుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా గృహ యజమానులు, పౌర సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళనలకు సిద్ధం కావడాన్ని ఎవరూ తప్పుబట్టలేరు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆస్తి (ఇంటి) పన్ను తగ్గించాలి, ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలి. ఇప్పటికే ఒకవైపు ఆదాయాలు తరిగి మరోవైపున ధరల పెరుగుదలతో బాధలు పడుతున్న ప్రజలకు కనీస ఉపశమనం కలిగించాలి.

నివాళి

నేడు ఎం.బి వర్ధంతి



విప్లవకర సిద్ధాంతమైన మార్క్సిజం, లెనినిజానికి చివరి వరకు కట్టుబడి, పీడిత ప్రజల విముక్తి కోసం విశిష్ట సేవలందించిన నేత మాకినేని బసవపున్నయ్య. భారతదేశంలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన వక్రీకరణలకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాటం సాగించారు. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంత వ్యాప్తికి, భారత ప్రజల విముక్తికి గణనీయమైన సేవలందించారు. మహత్తర వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులలో మాకినేని ఒకరు.

జననం: 14.12.1914
మరణం: 12.4.1992

వ్యాఖ్య

భవిష్యత్ మార్గం చూపిన పార్టీ మహాసభ

మదురైలో జరిగిన సిపిఐ(ఎం) 24వ మహాసభ గొప్ప ప్రజాప్రదర్శనతో ముగిసింది. అనేక కారణాల వల్ల దీనికి ప్రత్యేకత ఏర్పడుతున్నది. ఎజెండాలోను, చర్చల సారాంశంలోను కూడా మార్పులు ఉన్నాయి.

మొట్టమొదటిది-రాజకీయ తీర్మానం ముసాయిదాతో పాటు 23వ మహాసభలో ఆమోదించుకున్న రాజకీయ ఎత్తుగడల పంథా అమలుపై సమీక్షకు సంబంధించి ఒక రాజకీయ సమీక్ష నివేదికను కూడా మహాసభ ప్రతినిధుల చర్చ కోసం సమర్పించబడింది. మామూలుగా రాజకీయ సమీక్ష రాజకీయ నిర్మాణ నివేదికలో భాగంగా ఉండేది. రాజకీయ తీర్మానం ఆమోదించాక దాన్ని చర్చించటం జరుగుతుండేది.

లోతైన పరిశీలన

రాజకీయ ఎత్తుగడల పంథా ఏ విధంగా అమలు జరిగిందో దాంట్లో అనుభవాలు, బలహీనమైన, బలమైన అంశాలు ఏమిటో రాజకీయ సమీక్ష నివేదిక కొంత లోతుగా వెళ్లి పరిశీలించింది. పార్టీ స్వతంత్ర బలం పెరుగుదలకు ఆటంకంగా నిలిచిన అంశాలు ఏమిటో పార్టీ శాఖలు, శ్రేణులు అర్థం చేసుకోవడానికి ఇది వీలు కలిగించింది. 23వ మహాసభ తర్వాత 33,252 (3.37 శాతం) పార్టీ సభ్యత్వం పెరిగింది. మొత్తం అన్ని ప్రజాసంఘాల సభ్యత్వం పెరిగింది. అయినప్పటికీ పార్టీ స్వతంత్ర శక్తిలో కాని, రాజకీయ పలుకుబడిలో కాని చెప్పుకోదగిన మెరుగుదల లేదు. అందువల్లనే రాజకీయ తీర్మానం ముసాయిదా, నిర్మాణ నివేదిక ముసాయిదా రెండింటిపై జరిగిన చర్చల సందర్భంగా పూసల్లో దారం లాగా ఒకే అంశం నడిచింది. పార్టీ బలాన్ని, ప్రజా పునాదిని పెంపొందించడానికి చేయాల్సింది ఏమిటనే అంశం మీద చర్చ సాగింది.

స్వతంత్ర శక్తి పెంపు

రాజకీయ తీర్మానం ముందుంచిన ప్రధాన కర్తవ్యం బిజెపి, ఆర్ఎస్ఎస్ లను ఒంటరిని చేసి ఓడించటం. ఇది సిపిఐ(ఎం), వామపక్షాల సొంత బలం పెరగడం అన్న అంశాన్ని తప్పనిసరి ఆవశ్యకతగా చేస్తున్నది. బిజెపి పై పోరాడేందుకు ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య తత్వాలను రక్షించడానికిగాను అన్ని ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల విశాల ఐక్యతను పెంపొందించేందుకు సిపిఎం కృషి చేస్తుంది. అందుకు సహకరిస్తుంది. అదే సమయంలో పార్టీ బలాన్ని విస్తరించుకోవడం కోసం రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ కృషికి ప్రాధాన్యత ఇస్తుంది.



> పార్టీ భవిష్యత్తు పెరుగుదలకు సంబంధించిన ఒక కీలకమైన అంశం యువతను పార్టీలోకి పెద్ద సంఖ్యలో ఆకర్షించటం. కేరళ రాష్ట్ర శాఖ మొత్తం సభ్యత్వంలో 29 శాతం 31 ఏళ్ళు, అంతలోపు యువతను కలిగి ఉండడం ద్వారా ప్రశంసనీయమైన కృషి చేసింది. యువత కేంద్రిత రాజకీయ వేదికలు ఏర్పాటు చేయాలని, వారిలో సోషలిజం నిజమైన ప్రత్యామ్నాయం అనే ప్రచారాన్ని పెంచాలని రాజకీయ తీర్మానం, నిర్మాణ నివేదిక రెండూ చెప్పాయి.

ఇందుకు సంబంధించి హిందుత్వ భావజాలం పైన బిజెపి, ఆర్ఎస్ఎస్ ల మతతత్వ రాజకీయాలపైన నిరంతరాయ పోరాటం ఎలా సాగించాలన్న విషయమై మహాసభలో రాజకీయ తీర్మానంపై జరిగిన చర్చలు సరైన దిశా నిర్దేశం చేశాయి. పార్టీ అన్ని స్థాయిలలోనూ రాజకీయ సాంస్కృతిక సామాజిక రంగాలలో సైద్ధాంతిక కృషిని ముమ్మరం చేస్తుంది. హిందుత్వ కార్పొరేట్ పాలనా వ్యవస్థ నయా ఫాసిస్టు లక్షణాలను ప్రదర్శిస్తున్న కారణంగా ఈ పోరాటం తక్షణావసరం అవుతున్నది.

ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలు

రాజకీయ ఎత్తుగడల పంథా ఇచ్చిన మరొక నిర్దేశం వర్గ ప్రజా పోరాటాలను ఉధృతం చేయటం. స్థానిక పోరాటాలను నిరంతర ప్రాతిపదికన కొనసాగించాలని అది నొక్కి చెప్పింది. ఈ స్థానిక పోరాటాలే ప్రజా బాహుళ్యాన్ని పార్టీకి దగ్గర చేస్తాయి. రాజకీయంగా సంఘటితం కావడం దాని పలుకుబడి పెరగటం వీలవుతుంది. భూస్వాములు, సంపన్న పెట్టుబడిదారీ రైతులు, కాంట్రాక్టర్లు, బడా వ్యాపారులతో కూడిన గ్రామీణ సంపన్న కూటమికి వ్యతిరేకంగా గ్రామీణ పేదల పోరాటాలు గ్రామీణ ప్రాంతంలో మౌలిక వర్గ పోరాటాలుగా ఉంటాయి.

నిర్మాణంపై నివేదిక పార్టీ సొంత బలాన్ని, ప్రజా పునాదిని పెంచుకోవటం అనే ప్రధాన ఇతివృత్తాన్ని చర్చించింది. ఇందుకు సంబంధించిన కీలక అంశాలు- పార్టీ సభ్యత్వం నాణ్యతను మెరుగు పరచడానికి తీసుకున్న చర్యలు, ప్రాథమిక విభాగంగా ఉన్న శాఖలను క్రియాశీలం చేయడం. ఈ కర్తవ్యాల్లో కొంత పురోగమనం సాధించినప్పటికీ ఇంకా చాలా చేయవలసింది మిగిలి ఉంది. సభ్యత్వ నాణ్యత పెంచడానికి సంబంధించిన ముఖ్యమైన అంశం మహిళలను, యువతను పార్టీలోకి మరింతగా చేర్చుకోవటం. మొత్తం సభ్యత్వంలో మహిళలు 20.2 శాతం ఉన్నారు. నిర్మాణంపై కోల్‌కతా ప్లీనమ్ నిర్దేశించిన 25 శాతం మహిళల సభ్యత్వం లక్ష్యాన్ని చేరుకోవట తదుపరి అడుగు.

> రాజకీయ తీర్మానం ముందుంచిన ప్రధాన కర్తవ్యం బిజెపి, ఆర్ఎస్ఎస్ లను ఒంటరిని చేసి ఓడించటం. ఇది సిపిఐ(ఎం), వామపక్షాల సొంత బలం పెరగడం అన్న అంశాన్ని తప్పనిసరి ఆవశ్యకతగా చేస్తున్నది. బిజెపి పై పోరాడేందుకు ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య తత్వాలను రక్షించడానికిగాను అన్ని ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల విశాల ఐక్యతను పెంపొందించేందుకు సిపిఎం కృషి చేస్తుంది. అందుకు సహకరిస్తుంది. అదే సమయంలో పార్టీ బలాన్ని విస్తరించుకోవడం కోసం రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ కృషికి ప్రాధాన్యత ఇస్తుంది.

యువతపై కేంద్రీకరణ

పార్టీ భవిష్యత్తు పెరుగుదలకు సంబంధించిన ఒక కీలకమైన అంశం యువతను పార్టీలోకి పెద్ద సంఖ్యలో ఆకర్షించటం. కేరళ రాష్ట్ర శాఖ మొత్తం సభ్యత్వంలో 29 శాతం 31 ఏళ్ళు, అంతలోపు యువతను కలిగి ఉండడం ద్వారా ప్రశంసనీయమైన కృషి చేసింది. యువత కేంద్రిత రాజకీయ వేదికలు ఏర్పాటు చేయాలని, వారిలో సోషలిజం నిజమైన ప్రత్యామ్నాయం అనే ప్రచారాన్ని పెంచాలని రాజకీయ తీర్మానం, నిర్మాణ నివేదిక రెండూ చెప్పాయి.

కొత్త నాయకత్వం

మహాసభ 85 మంది సభ్యులతో కేంద్ర కమిటీని ఎన్నుకోగా అందులో 30 మంది కొత్త వారే ఉన్నారు. 17 మంది మహిళలను చేర్చుకోవడం ద్వారా కమిటీలో 20 శాతం మహిళలు ఉండాలన్న కోటా కూడా పూర్తయింది 18 మంది సభ్యులతో పొలిట్ బ్యూరోను, ఎం.ఎ బేబీని నూతన కార్యదర్శిగా కొత్త కేంద్ర కమిటీ ఎన్నుకున్నది. మహాసభ నిర్దేశించిన రాజకీయ, నిర్మాణ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోవడంలో ఈ నూతన నాయకత్వం, బృందంపై విశ్వాసం వుంచవచ్చు.

తమిళనాడు రాష్ట్ర కమిటీ 24వ మహాసభకు సమర్థంగా ఆతిథ్యమిచ్చి నిర్వహించింది. మహాసభ కోసం సాగిన సన్నాహాలలో అన్ని స్థాయిలలోని పార్టీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవిష్యత్తు దిశగా ముందుకు సాగడానికి మార్గం ఏర్పడిందనే గట్టి ఆత్మవిశ్వాసాన్ని, దృఢ సంకల్పాన్ని మహాసభ ప్రతినిధులలో పాదుకొల్పింది.

(ఏప్రిల్ 9 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

అభిప్రాయం

సమాఖ్య స్ఫూర్తికి పట్టం

తమిళనాడు గవర్నర్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల్ని చట్ట వ్యతిరేకమంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకం. ఆయన తొక్కిపెట్టిన పది బిల్లులను ఆమోదించినట్టుగానే భావిస్తూ తీర్పునివ్వడం సరైన చర్య. ముందు ముందు అలా తొక్కిపెట్టే అవకాశాల్ని తగ్గిస్తూ గవర్నర్ విధులకు అవసరమైన పరిమితుల్ని విధించడం కూడా మంచిదే. గవర్నర్ స్థానానికి పెద్దరికం కట్టబెడుతూ, రాజ్యాంగం అస్పష్టంగా వదిలివేసిన లక్ష్మణ రేఖల్ని నేడు న్యాయస్థానం దిద్ది బాగా కనబడేట్టు చేయాల్సి రావడం రాజకీయాల పుణ్యమే.

మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ. ప్రజలెన్నుకున్న ప్రతినిధుల ద్వారా సాగే ప్రజాపాలన. వారి అభీష్టం మేరకు, వారు చేసే చట్టాలు అమల్లోకి రావాలి. రాష్ట్రమైనా, కేంద్రమైనా ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా వ్యక్తమయ్యే అంగీకారానిదే పై చేయి కావాలి. ఇక్కడ రాష్ట్రపతి, గవర్నర్లది కేవలం నామమాత్రపు పాత్ర. గౌరవం కోసం, అత్యవసరపు పరిస్థితుల్లో కొంత క్రియాశీలం కావడం కోసం సృష్టించుకున్న పాత్ర తప్పించి, రోజువారీ వ్యవహారాల్లో అంటీముట్టనట్టు ఉండాల్సిన పాత్ర. అయితే దానికి రాజకీయ వాసనల్ని అంటగట్టే ప్రయత్నాలతోనే చిక్కులొస్తున్నాయి.

కేంద్రంలో అధికారం ఉన్న పార్టీ, రాష్ట్రానికి గవర్నర్లను నియమిస్తుంది. ఆ పార్టీ ఇష్టం పైనే ఆయన ఎంతకాలం పదవిలో ఉంటారో నిర్ణయింపబడుతుంది. రాష్ట్రంలో విపక్షం అధికారంలో ఉన్నప్పుడు, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్రంలోని ప్రభుత్వం వ్యవహరించాలని భావించినప్పుడు ఆ పని గవర్నర్ ద్వారా చెయ్యడానికి పూనుకుంటుంది. అలాంటి స్థితిలో కొంతమంది అత్యుత్సాహపు గవర్నర్లు ఇంకొంచెం ముందుకుపోయి తమ బాధ్యతలు అతిక్రమిస్తారు. రాజ్యాంగం స్పష్టపరచని పరిమితుల్ని దాటి కేంద్రం పట్ల విధేయతను చాటుకుంటారు తప్ప రాజ్యాంగ స్ఫూర్తి ఏమిటన్నది పట్టించుకోరు. తమిళ నాడు గవర్నర్ చేసింది ఇదే. అక్కడి శాసన సభ ఆమోదించి పంపిన బిల్లుల్ని అవుననకా, కాదనకా ఏళ్ళకు ఏళ్లుగా తొక్కిపట్టారు. అయితే అవుననాలి లేదా కాదని శాసన సభకు తిప్పి పంపితే, తిరిగి వారు మళ్లీ పంపితే తప్పనిసరిగా ఆమోదించాలి. లేదంటే రాష్ట్రపతికి ముందే నివేదించాలి. అయితే వీటికి కాల వ్యవధి నిర్ణయించక పోవడం వల్ల, దాన్ని అలుసుగా తీసుకుని గవర్నర్ పది బిల్లుల్ని తొక్కిపట్టారు. పైగా అవి శాసనసభ రెండోసారి కూడా ఆమోదించి పంపినవి. ఇలా రెండు రకాలుగా ఆయన తన పెద్దరికపు పాత్రను అతిక్రమించారు.

ఇప్పుడు సుప్రీం ఆ తప్పుని ఎత్తి చూపడమే కాకుండా దిద్దింది. ఆ బిల్లుల్ని ఆమోదించినట్లు భావించాలని ప్రకటించింది. ఇకపై గవర్నర్లు బిల్లులపై తీసుకొనే నిర్ణయాలకు వ్యవధి నిర్ణయించింది. వ్యవధి దాటితే ఆమోదం పొందినట్లుగా తీర్పునిచ్చింది. ఇది సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామిక వ్యవస్థను బలపర్చడమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థల బాధ్యతల్ని గుర్తు చేసే మంచి తీర్పు.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

కవిత్వం

పుస్తకాల సంచి చెప్పిన పాఠం

పుస్తకాల సంచిని
గుండెలకు హత్తుకుని
పరుగుతీసిన ఆ చిన్నారిలో
నాకు సావిత్రీబాయి పూలే కనిపించింది.
మానవీయత చూపని
అధికార బుల్డోజర్ బలగం
పేదల గుడిసెలపై ఉన్నట్టుండి
పంజా విసిరింది.
అక్కడ ఇళ్ళను
ఎందుకు కూల్చుతున్నారో
ఆ చిన్నారికి తెలియదు.
ఇళ్ళన్నీ నేలకూలుతున్న
సమయంలో..
వ్యాపించిన మంటల్ని
చిన్నారి గమనించిందో లేదో
ఒక్క ఉదుటున లేచి...
గుడిసెలోని తన పుస్తకాల
సంచిని భద్రంగా గుండెలకు
హత్తుకుని బయటకు
పరుగు తీసింది.
పుస్తకాల సంచి లోనే
తన జీవితం ఉందనుకుంది
అందుకే తన ఇంటిలోని
వస్తువుల కోసం ఆలోచించలేదు.
చిన్నారి పరుగు
బుల్డోజర్ సంస్కృతిని ప్రశ్నించింది.
ఆ చిన్న పుస్తకాల సంచి
వ్యవస్థకు పెద్ద పాఠమై నిలిచింది.
సుప్రీంకోర్టును తాకిన
ఆ చిన్నిపాదాల పరుగు...
న్యాయమూర్తుల
హృదయాలను కలవరపెట్టింది.
పుస్తకాల సంచి కోసం
చిన్నారి పడిన తపనే
దేశం కళ్లన్నీ ఒక్కసారిగా
తనవైపు చూసేలా చేసింది.
చిన్నారి పరుగులోని
ఒక్కో అడుగు పాలకుల తీరుకు
లెక్కలేని చెంపదెబ్బలే.

- పొనుగుమట్ల అశోక్ కుమార్,
యానాం, సెల్: 9959379709

విశ్లేషణ

'హైడ్రో'తో ఆదివాసీ హక్కుల ఉల్లంఘన



> వాస్తవానికి, ఇది ప్రాజెక్టు ప్రాంతాల సమీపంలోని ఆదివాసీల నీటి భద్రతపై మాత్రమే కాకుండా, మైదానాల్లోని రైతులపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ప్రాజెక్టుల నీటి డిమాండ్ల విస్తృత ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం, ఆరు ప్రాజెక్టులకు సంబంధించిన డి.పి.ఆర్ లు తుది దశలో ఉన్నాయి. అయితే కురుకుట్టి, కర్రివలస ప్రాజెక్టులు పొరుగు రాష్ట్రమైన ఒడిశాతో సరిహద్దు వివాదాల రూపంలో అదనపు అడ్డంకులను ఎదుర్కొంటున్నాయి. అయితే బలమైన స్థానిక వ్యతిరేకత కారణంగా యెర్రవరం ప్రాజెక్టు పనులు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. మిగిలిన ప్రాజెక్టు బాధిత ఆదివాసీ తెగలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కార్పొరేట్ కంపెనీల దోపిడికి అడ్డుగా వున్న రాజ్యాంగ హక్కులను సవరించాలని, రద్దు చేయాలని బాహాటంగానే ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలపై ఆదివాసీలు అప్రమత్తంగా వుండి చట్టాలు, హక్కులను రక్షించుకోవాలి.

రాష్ట్రంలో న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్.ఆర్.ఇ.డి.సి.ఎ.పి) ద్వారా 7,400 మెగావాట్ల సామర్థ్యంతో పంప్ట్ స్టోరేజి పవర్ ప్రాజెక్టులకు 2019 నుండి 2025 మధ్య రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఉత్తరాంధ్ర 'ఏజెన్సీ' ప్రాంతాలలో- రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసీలను, ఇతర పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించడం దారుణం.

హైడ్రో పవర్ ప్రాజెక్టు సామర్థ్యం-కేటాయింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు మండలంలో కురుకుట్టి పి.ఎస్.పి (1,200 మెగావాట్లు), పాచిపెంట మండలంలో కర్రివలస పి.ఎస్.పి (1,000 మెగావాట్లు) ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలంలోని పెదకోట పి.ఎస్.పి 2024 ఆగస్టులో దాని సామర్థ్యాన్ని 1,500 మెగావాట్లు నుండి 1,800 మెగావాట్లకి పెంచింది. నవయుగ కంపెనీకి గుజ్జిలి పి.ఎస్.పి (1,500 మెగావాట్లు), చిట్టంపాడు పి.ఎస్.పి (800 మెగావాట్లు) కేటాయించారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు చింతపల్లి, కొయ్యూరు మండలాల్లోని యర్రవరం పి.ఎస్.పి (1,200 మెగావాట్లు) కేటాయించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై గోప్యత ఎందుకు?



పి. అప్పలనర్స

1/70 చట్టాన్ని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వర్తించే వివిధ రాజ్యాంగ నిబంధనలను బహిరంగంగా ధిక్కరిస్తూ ఈ ప్రాజెక్టులకు అనుమతించిన తీరు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వీటిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీల షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు నియమాలు (పెసా), అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఎ) ఉన్నాయి. ముఖ్యంగా పెసా లోని సెక్షన్ 5 ప్రకారం ఏదైనా భూసేకరణకు ముందు, ప్రభుత్వం వివరణాత్మక ప్రాజెక్ట్ సమాచారాన్ని మండల ప్రజా పరిషత్‌కి సమర్పించాలి. ఈ సమాచారంలో సమగ్ర ప్రాజెక్ట్ రూపురేఖలు, సామాజిక ప్రభావాలు, భూసేకరణ ప్రత్యేకతలు, కొత్త స్థిరనివాసుల గురించి సమాచారం, వారి తెగలపై సామాజిక ప్రభావం, ప్రభావిత వర్గాలకు ప్రతిపాదిత పరిహారం వంటివి ఉండాలి. అప్పుడు ఎంపిపి చట్టబద్ధంగా ప్రభావిత గ్రామ పంచాయతీ, గ్రామ సభలతో సంప్రదించి వారి అంచనాలు, సిఫార్సులను సేకరించాలి. ఈ సంప్రదింపుల తర్వాత, ఎం.పి.పి ఈ సిఫార్సులను ఏకీకృతం చేసి, భూసేకరణ అధికారికి తుది సిఫార్సును సమర్పించాలి. వారు ఈ సిఫార్సులకు కట్టుబడి ఉండాలి. లేదా తేడా చేస్తే వివరణాత్మక రాతపూర్వక సమాధానం అందించాలి. ఎఫ్.ఆర్.ఎ లోని సెక్షన్ 6, వ్యక్తిగత, కమ్యూనిటీ అటవీ హక్కులను నిర్ణయించే ప్రక్రియను ప్రారంభించడానికి, పర్యవేక్షించడానికి గ్రామసభను ప్రాథమిక అధికారంగా స్పష్టంగా పేర్కొంటుంది. అటవీ భూమిని లేదా అటవీ నివాసుల హక్కులను ప్రభావితం చేసే ఏదైనా ప్రాజెక్ట్ ప్రారంభం నుండే గ్రామసభ పాల్గొనాలని ఎఫ్.ఆర్.ఎ నిర్దేశిస్తుంది. అంతేకాకుండా, ఎఫ్.ఆర్.ఎ లోని సెక్షన్ 4(డి) కమ్యూనిటీ అటవీ వనరులను నియంత్రించడానికి, వన్యప్రాణులు-జీవవైవిధ్య రక్షణకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడానికి గ్రామసభ అధికారాన్ని బలోపేతం చేస్తుంది. ఆదివాసీ తెగలు, కంపెనీలైన వాటాదారులు ఈ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని నిర్దేశిస్తుంది. ఈ సంప్రదింపుల ప్రక్రియను దాటవేశారు. ఈ పి.ఎస్.పి లకు సంబంధించి, ఎటువంటి సమాచారం అందించబడలేదు. ఎటువంటి చర్చ జరగలేదు. పారదర్శకత లేదు. ఈ ప్రాంతాల్లోని ఆదివాసీలకు ఉద్దేశపూర్వకంగా దీన్ని గోప్యంగా ఉంచారు. ఆదివాసీ తెగల నుండి సంప్రదింపులు, సమ్మతి లేకపోవడాన్ని మనం గమనించాలి.

షెడ్యూల్డ్ ప్రాంతాలలో భూమిని లీజుకు ఇవ్వడం ఆంధ్రప్రదేశ్ భూ బదిలీ నియంత్రణ (ఎల్.టి.ఆర్) చట్టం ద్వారా నిషేధం. షెడ్యూల్డ్ ప్రాంతాలలో ప్రైవేట్ సంస్థలు ప్రాజెక్టులను చేపట్టలేవని సుప్రీంకోర్టు 1997 సమతా కేసులో పేర్కొంది. అంతేకాకుండా, ఇది చట్టబద్ధమైన అవసరం అయినప్పటికీ, గిరిజన సలహా మండలి (టి.ఎ.సి)లో ఈ ప్రాజెక్టులపై చర్చ, ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికీ టి.ఎ.సి ని నియమించలేదు. ఈ ఆరు ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వల్ల కలిగే భారీ స్థాయి స్థానభ్రంశం గురించి, ఆదివాసీ తెగ వర్గాల జీవనోపాధిని కోల్పోయే అవకాశం గురించి ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తుంది.

అటవీ, వ్యవసాయ భూమి సేకరణ

యర్రవరం ప్రాజెక్టుకు అత్యధికంగా 735.63 ఎకరాలు, తరువాత గుజ్జిలి 673.13 ఎకరాలు, పెదకోట 499.44 ఎకరాలు, కురుకుట్టి 422.99 ఎకరాలు, కర్రివలస 377.99, చిట్టంపాడు 500 ఎకరాలు అవసరం. మొత్తం ఉద్దేశించిన 3,361.35 ఎకరాల భూ సేకరణకు ప్రభుత్వ ప్రణాళిక సిద్ధం చేసింది. కానీ వాస్తవానికి సుమారు పది వేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూమికి నష్టం జరిగే అవకాశం ఉందని ఆదివాసీ తెగలు పేర్కొంటున్నాయి.

భూసేకరణ సమస్యకు మించి, స్థానిక నీటి వనరులపై ప్రాజెక్టులు ఆధారపడటం వలన నీటి భద్రత గురించి, ఈ వనరులపై ఆధారపడిన ఆదివాసీ తెగలు, దిగువ రైతులపై దాని సామాజిక ప్రభావం గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తాయి. ఈ పి.ఎస్.పి లలో ప్రతి ఒక్కటి ఎగువ, దిగువ జలాశయాన్ని నిర్మిస్తారు. దీనికి చాలా పెద్ద మొత్తంలో భూమి అవసరం. వరద ఉధృతితో వేలాది ఎకరాల అటవీ,వ్యవసాయ భూమి మునిగే అవకాశాలు చాలా ఎక్కువ.

నీటి భద్రత-ఆందోళన

కురుకుట్టి, కర్రివలస పి.ఎస్.పి లు రెండూ బోదురుగెడ్డ నది నుండి నీటిని తీసుకోవడానికి నిర్ణయించబడ్డాయి. ఇది ఒడిశాలో ఉద్భవించి, ఆంధ్రప్రదేశ్ గుండా ప్రవహించి, నాగావళి నది పరీవాహక ప్రాంతంలోని సువర్ణముఖి నదిలో కలుస్తుంది. ఈ రెండు ప్రాజెక్టులు ఈ నదిపై నిర్మించిన దిగువ జలాశయాన్ని పంచుకుంటాయి. అదే సమయంలో, ఎర్రవరం (పి.ఎస్.పి) ఎర్రవరం, గనగుల గ్రామాల మధ్య ప్రవహించే ఒక చిన్న, పేరులేని ప్రవాహం నుండి నీటిని పొందాలని నిర్ణయించారు. నీరు తగ్గి చివరికి తాండవ జలాశయం ఖాళీ అవుతుంది. దిగువ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

శారద నదిలోకి ప్రవహించే రెండు చిన్న ప్రవాహాల నుండి నీటిని తీసుకునే ఓపెన్-లూప్ వ్యవస్థగా మొదట భావించిన గుజ్జిలి పి.ఎస్.పి, తరువాత పర్యావరణ సమస్యలకు ప్రతిస్పందనగా క్లోజ్డ్-లూప్ వ్యవస్థగా పున:రూపకల్పన చేయబడింది. ఇది ఇప్పుడు దిగువ జలాశయం నుండి 6.8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాం జలాశయం నుండి నీటిని ఉపయోగించుకుంటుంది. బొడ్డేరు నదిపై నిర్మించిన కోనాం జలాశయం ప్రస్తుతం 12,638 ఎకరాల సాగునీటి ప్రాంతానికి సేవలు అందిస్తుంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఈ పి.ఎస్.పి కి దిగువ జలాశయంగా పనిచేస్తుంది. అదేవిధంగా, పెదకోట పి.ఎస్.పి యొక్క నీటి వనరు కూడా పర్యావరణ పరిగణనల కారణంగా మార్చబడింది. ప్రారంభంలో బొడ్డేరు నది (శారద నది ఉపనది)పై దిగువ జలాశయంతో ఓపెన్-లూప్ వ్యవస్థగా రూపొందించబడిన దీనిని క్లోజ్డ్-లూప్ వ్యవస్థగా సవరించారు. బొడ్డేరు నది యొక్క సహజ ప్రవాహాన్ని కాపాడటానికి కోనం జలాశయాన్ని దాని నీటి వనరుగా ఉపయోగించుకోవడానికి కూడా ఉద్దేశించబడింది.

గుజ్జిలి, పెదకోట పి.ఎస్.పి లను క్లోజ్డ్-లూప్ వ్యవస్థలుగా పున:రూపకల్పన చేసినప్పటికీ, పర్యావరణ ప్రభావంపై ఆందోళనలు కల్గిస్తోంది. పెదకోట ప్రాజెక్ట్‌ను క్లోజ్డ్-లూప్ వ్యవస్థగా పున:రూపకల్పన చేసినప్పటికీ, నిపుణుల అంచనా కమిటీ (ఇ.ఎ.సి) బొడ్డేరు నదిపై దాని దిగువ జలాశయం ఉన్నందున దీనిని ఓపెన్-లూప్ ప్రాజెక్ట్‌గా మార్చారు. తత్ఫలితంగా, ప్రాజెక్ట్ ప్రతిపాదకులు కేంద్ర విద్యుత్ అథారిటీ (సి.ఇ.ఎ), కేంద్ర జల సంఘం (సి.డబ్ల్యు.సి) నుండి ఆమోదాల కోసం దీనిని ఓపెన్-లూప్ వ్యవస్థగా పరిగణించి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డి.పి.ఆర్)ను సిద్ధం చేయాలని ఇ.ఎ.సి సిఫార్సు చేసింది.

ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రాజెక్టులలో ఆదివాసీలు తమ జీవనోపాధి కోసం-గృహ అవసరాలు, వ్యవసాయం కోసం ఉపయోగించే స్థానిక వనరుల నుండి నీటిని తీసుకోవడం జరుగుతుంది. ఈ వాగులు, నీటి వనరులు వివిధ జలాశయాలకు క్యాచ్‌మెంట్‌లో భాగమని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. వాస్తవానికి, ఇది ప్రాజెక్టు ప్రాంతాల సమీపంలోని ఆదివాసీల నీటి భద్రతపై మాత్రమే కాకుండా, మైదానాల్లోని రైతులపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ప్రాజెక్టుల నీటి డిమాండ్ల విస్తృత ప్రభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం, ఆరు ప్రాజెక్టులకు సంబంధించిన డి.పి.ఆర్ లు తుది దశలో ఉన్నాయి. అయితే కురుకుట్టి, కర్రివలస ప్రాజెక్టులు పొరుగు రాష్ట్రమైన ఒడిశాతో సరిహద్దు వివాదాల రూపంలో అదనపు అడ్డంకులను ఎదుర్కొంటున్నాయి. అయితే బలమైన స్థానిక వ్యతిరేకత కారణంగా యెర్రవరం ప్రాజెక్టు పనులు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. మిగిలిన ప్రాజెక్టు బాధిత ఆదివాసీ తెగలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కార్పొరేట్ కంపెనీల దోపిడికి అడ్డుగా వున్న రాజ్యాంగ హక్కులను సవరించాలని, రద్దు చేయాలని బాహాటంగానే ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలపై ఆదివాసీలు అప్రమత్తంగా వుండి చట్టాలు, హక్కులను రక్షించుకోవాలి.

/ వ్యాసకర్త గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు,
సెల్ : 9490300917 /

విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణా జిల్లా)

విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టుకు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో అవసరమైన స్థలాలను శుక్రవారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. గుడివాడ ఆర్‌డిఒ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులతో కలిసి విజయవాడ మెట్రో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ జి.వి.రంగారావు... గన్నవరం, కేసరపల్లిలో పర్యటించారు. గన్నవరం బస్టాండ్, ప్రభుత్వాస్పత్రి, హెచ్‌సిఎల్, కేసరపల్లి సెంటర్, విమానాశ్రయం ప్రాంతాల్లో మెట్రో స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. హెచ్‌సిఎల్, కేసరపల్లిలో 12:42 మీటర్ల నిష్పత్తితో నిర్మించనున్న మెట్రోస్టేషన్లకు అవసరమైన భూసేకరణపై సమాలోచనలు చేశారు. ప్రాజెక్టు మొదటి కారిడార్‌లో 26 కిలోమీటర్లు మేర మెట్రో నిర్మాణాన్ని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం వరకు ఉంటుంది. ఈ సందర్భంగా గుడివాడ ఆర్‌డిఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... గన్నవరం బస్టాండ్ వద్ద మెట్రో ప్రాజెక్టు ప్రారంభమై హెచ్‌సిఎల్ కంపెనీ మీదుగా విమానాశ్రయంలోకి వెళుతుందన్నారు. అక్కడ నుండి కేసరపల్లి, గూడవల్లి, నిడమానూరు, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల మీదుగా విజయవాడ వెళుతుందన్నారు. గ్రామాల వారీగా మెట్రోస్టేషన్లు ఉంటాయని తెలిపారు. ముందుగా ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నామని, అవి అందుబాటులో లేకపోతే భూ సేకరణ జరుపుతామని చెప్పారు. మెట్రోకోచ్ డిపోకు 60 ఎకరాలు అవసరం అవుతాయని తెలిపారు. ఇందుకు కేసరపల్లి ప్రాంతంలో స్థల పరిశీలన చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిలోనే దీనిని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. మెట్రో స్టేషన్లను జాతీయ రహదారికి 15 మీటర్ల దూరంలో నిర్మించే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం తహశీల్దారు వెంకట శివయ్య, విద్యుత్ శాఖ ఎఇ రాజు, ఆర్‌అండ్‌బి ఎఇ, అగ్రికల్చర్ అధికారులు, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో మెట్రోరైలు ప్రాజెక్టుకు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న మెట్రో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ జి.వి.రంగారావు, గుడివాడ ఆర్‌డిఒ సుబ్రహ్మణ్యం తదితరులు

ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

- రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు
- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ రంగంలో పెట్టుబడి పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తగిన ప్రోత్సహకాలు ఇస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జి. వీరపాండ్యన్ తెలిపారు. బెంగళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఒక హోటల్‌లో 'ఫార్మా టెక్ కవరేజి-2025' అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతం వ్యాక్సిన్‌లు రాష్ట్రంలోనే తయారవుతున్నాయని తెలిపారు. జనరిక్ మెడిసిన్స్‌లో అత్యధిక తయారీ, విక్రయాలు రాష్ట్రంలోనే ఉన్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో రాష్ట్రంలోని వైద్యులు ముందంజలో ఉన్నారని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) కూడా వైద్య రంగంలో ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. విశాఖలో మెడ్‌టెక్ జోన్‌ను ఏర్పాటు చేసి వంద ఫార్మా కంపెనీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.ఫార్మా రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం తగిన చేయూతను ఇస్తుందన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ సిఇఒ, రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ పి.రవి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, రిమోట్ ఏరియాలకు కూడా ప్రభుత్వం మందుల సరఫరాను పెంచిందన్నారు. సిప్లా కంపెనీ బిజినెస్ యూనిట్ హెడ్ ఎస్.బెనర్జి, ఇఎస్ఐ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మాజీ ఐఎఎస్ అధికారి డాక్టర్ కె.ఎస్.కేదర్, బెంగళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఉషా మంజునాథ్, ఫార్మా కంపెనీల నిర్వహాకులు, ఫార్మా విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి : ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాక్షి దినపత్రిక సంపాదకులు ధనుంజయరెడ్డి, పల్నాడు జిల్లాకు చెందిన మరో ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్లు డిమాండ్ చేశాయి. మాచర్ల మండలంలో జరిగిన పి హరిశ్చంద్ర అనే వ్యక్తి హత్య కేసు ప్రచురణ వార్త కారణంగా సమాజంలో వైషమ్యాలు పెచ్చరిల్లుతాయనే సాకుతో కేసు బనాయించటం అక్రమమని ఎపిడబ్ల్యూజెఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ కన్వీనర్లు వి శ్రీనివాసరావు, కె మునిరాజు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. హంతకులను పట్టుకుని శిక్షించాల్సిన పోలీసులు, ఇటువంటి కేసులు బనాయించటం ఎంతమాత్రం సమంజసంగా లేదన్నారు. ప్రచురితమైన సమాచారంలో పొరపాట్లు ఉంటే వాటిని సవరించుకునేందుకు వివిధ మార్గాలు ఉన్నాయని వెల్లడించారు. ఆ దిశగా చర్యలు చేపట్టకుండా మీడియాను, జర్నలిస్టులను భయభ్రాంతులను చేసే వైఖరిని పోలీసులు అనుసరించటం సరైనది కాదని అన్నారు. ఇటీవల కర్నూలు జిల్లా ఆదోని పోలీస్ స్టేషన్ వ్యవహారాలపై ప్రచురితమైన ఒక వార్తకు సంబంధించి కూడా 8 దినపత్రికలకు పోలీసులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. జర్నలిస్టులను భయభ్రాంతులను చేసే చర్యలకు పోలీసులు పాల్పడకుండా ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చందు జనార్ధన్, ఐజెయు జాతీయ కార్యదర్శి సోమసుందర్, సామ్నా రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు, ప్రధాన కార్యదర్శి రామణారెడ్డి కోరారు. ఈ మేరకు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు.

శాప్ కార్యకలాపాలు విస్తృతం

- చైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రీడల అభివృద్ధే అజెండాగా ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని ఆ సంస్థ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. క్రీడల అభివృద్ధి, సమ్మర్ క్యాంపుల నిర్వహణపై విజయవాడలోని తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. క్రీడా సంఘాలను సమన్వయం చేసుకుని రాష్ట్రంలో పెద్దయెత్తున క్రీడా పోటీలు నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. స్పోర్ట్స్ ఫెడరేషన్లు నిర్వహించే క్రీడలను రాష్ట్రంలోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. క్రీడల నిర్వహణకు అనుగుణంగా ప్రభుత్వం తరపున శాప్ కూడా అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. త్వరలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంపులను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నాటికి అన్ని జిల్లాల డిఎస్‌డిఒలకు సమగ్ర సమాచారాన్ని పంపించాలని, పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకునేలా అదేశాలు జారీ చేయాలని చెప్పారు. జిల్లా స్థాయిలో సమ్మర్ క్యాంపుల నిర్వహణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు డిఎస్‌డిఒతో పాటు ప్రతి జిల్లాకు కోచ్‌ను నియమించాలని తెలిపారు. క్రీడా యాప్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు అనుగుణంగా సిబ్బంది కసరత్తు చేయాలని చెప్పారు.

సామాజిక సమస్యలు పరిష్కరించాల్సిందే

- 'అనంత'లో సామాజిక చైతన్య యాత్ర ప్రారంభం


అనంతపురం జడ్‌పి కార్యాలయం వద్ద సామాజిక యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న డా॥ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర శుక్రవారం ప్రారంభం అయ్యింది. అనంతపురం జడ్‌పి కార్యాలయం ఆవరణంలో జ్యోతిబాపూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాత్రను ఐద్వా నాయకులు డాక్టర్ ప్రసూన జెండా ఊపి ప్రారంభించారు. మొదటి రోజు బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో యాత్ర సాగింది. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యాత్ర బృందం పర్యటించి సామాజిక సమస్యలను అధ్యయనం చేసి.. వారు పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయనుందని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప మట్లాడుతూ ఇప్పటికీ అనేక దళితవాడల్లో కనీస సదుపాయాలకు నోచుకోవడం లేదని అన్నారు. ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి శ్మశానవాటికల్లేని దుస్థితి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి సావిత్రి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్‌తో ఇవిఎంలను అనుసంధానించలేం

- తులసి గబ్బార్డ్ వ్యాఖ్యలపై స్పందించిన ఇసి

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు హ్యాక్ చేయడానికి అనువుగా వుంటాయని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ చేసిన వ్యాఖ్యలపై భారత ఎన్నికల కమిషన్ శుక్రవారం స్పందించింది. సులభంగా, సక్రమంగా, కచ్చితమైన కాలిక్యులేటర్ల మాదిరిగా పనిచేసే ఇవిఎంలను భారత్ ఉపయోగిస్తోందని, వాటిని ఇంటర్‌నెట్‌కు, వైఫైకు లేదా ఇన్‌ఫ్రారెడ్‌కు అనుసంధానించలేమని స్పష్టం చేసింది. కొన్ని దేశాలు ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థలు అనేక వ్యవస్థల మిళితంగా వుంటాయని ఇసి వర్గాలు తెలిపాయి. ఇంటర్‌నెట్ వంటి వివిధ ప్రైవేటు నెట్‌వర్క్‌లతో సహా పలు యంత్రాలు, ప్రాసెస్‌ల సమాహారంగా అవి వుంటాయన్నారు. భారత్‌లో ఈ ఇవిఎంలు సుప్రీంకోర్టు నిర్వహించిన న్యాయబద్ధమైన పరిశీలనకు నిలబడ్డాయన్నారు. పోలింగ్ ప్రారంభం కావడానికి ముందుగా నమూనా ఎన్నికల నిర్వహణకు ఉపయోగించడంతోసహా వివిధ దశల్లో రాజకీయ పార్టీలు కూడా వీటిని తనిఖీ చేశాయని ఆ వర్గాలు తెలిపాయి. ఐదు కోట్లకు పైగా కాగితపు బ్యాలెట్లతో పరిశీలించి, పోల్చి నిర్ధారించామని, ఇదంతా కూడా రాజకీయ పార్టీల సమక్షంలోనే జరిగిందని ఇసి వర్గాలు తెలిపాయి. దీర్ఘకాలంగా ఈ ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థలు ఎలా హ్యాకింగ్‌కు అనువుగా వున్నాయో తెలియజేసే సాక్ష్యాధారాలు అమెరికా కేబినెట్‌కు దొరికాయని తులసి గబ్బార్డ్ గురువారం తెలిపారు. ఓట్లు వేసినప్పుడు ఫలితాలను మార్చివేసేందుకు వీటితో అవకాశం వుంటుందని అన్నారు. ఈ నిర్ధారణలతోనే దేశవ్యాప్తంగా కాగితపు బ్యాలట్లు ఉపయోగించాలని ఆదేశాలు జారీ అయ్యాయని చెప్పారు. తద్వారా అమెరికా ఎన్నికల సమగ్రత పట్ల ప్రజలకు నమ్మకం వుంటుందన్నారు. మానవులు లేదా కృత్రిమ మేథ ఈ యంత్రాలను హ్యాక్ చేసేందుకు ముప్పు పొంచి వుందంటూ గతేడాది ఎలన్ మస్క్ హెచ్చరిస్తూ, ఇవిఎంలను తొలగించాలని కోరారు.

పశ్చిమ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్యం అవసరం !

- విదేశాంగమంత్రి జై శంకర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : స్వేచ్ఛా వాణిజ్యంపై పశ్చిమ దేశాలతో భాగస్వామ్యం పెంచుకోవాల్సిన ఆవశ్యకత వుందని విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. పశ్చిమ దేశాల్లోనే వాస్తవ పురోగతి సాధ్యమవుతుందని, అక్కడ మరిన్ని అవకాశాలు వుంటాయని, అందువల్ల మన వాణిజ్య భాగస్వాములు ఇక్కడే వుంటారని మనలో చాలామంది వాదిస్తుంటారని అన్నారు. పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలు మరింత పోటీ తత్వంతో కూడి వుంటాయన్నారు. అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం ప్రస్తుతం అవకాశాలు మెండుగా వుంటాయని అన్నారు. కార్నెగీ ఇండియా వార్షిక అంతర్జాతీయ టెక్నాలజీ సదస్సులో జై శంకర్ మాట్లాడారు. భారత్ స్వావలంబనకు అనుగుణంగా మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ ఉద్యమాన్ని చూడాలా అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ మంత్రి, ఇందులో పరస్పర విరుద్ధమైన భావన నెలకొందని తాననుకోవడం లేదన్నారు. ప్రపంచం దిశ గురించి నిష్పాక్షికంగా ఆలోచించే వారెవరైనా ఈ ధోరణులను గమనిస్తారని అన్నారు. ఇదేమీ ఒక్కసారిగా ఊడిపడింది కాదని వ్యాఖ్యానించారు.

పోలవరాన్ని సందర్శించిన కేంద్ర జల సంఘం డిప్యూటీ డైరెక్టర్లు

ప్రజాశక్తి - పోలవరం: పోలవరం ప్రాజెక్టును కేంద్ర జల సంఘం డిప్యూటీ డైరెక్టర్లు మయాంక్ చేతన్, ఉత్కర్ష్ శుక్రాలు శుక్రవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలవరం చేరుకున్న ఈ బృందం తొలుత పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రంవాల్, బట్రస్ డ్యాం నిర్మాణ పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



బీహార్‌లో వర్షబీభత్సం

- 80 మంది బలి
- యుపిలో మరో 22 మంది మృతి

న్యూఢిల్లీ : భారీ వర్షాలు బీహార్‌ను అతలాకుతలం చేశాయి. ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లలోనూ బీభత్సం సృష్టించాయి. వీటి ప్రభావంతో బీహార్‌లోనే 80 మంది ప్రాణాలు కోల్పోగా, ఉత్తర ప్రదేశ్‌లో మరో 22 మంది మరణించారు. బీహార్‌లోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. పిడుగులు, వడగళ్ల కారణంగా మరణాలు సంభవించినట్లు ప్రభుత్వం తెలిపింది. మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారాన్ని ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ప్రకటించారు. రాష్ట్రంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉందని ఆర్‌జెడి నాయకులు తేజస్వీ యాదవ్ తెలిపారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కూడా బీహార్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఉత్తరప్రదేశ్‌ను శుక్రవారం భారీ వర్షాలు ముంచెత్తాయి. 22 మంది మరణించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జార్ఖండ్‌లోనూ భారీ వర్షాలు కురిసాయి. పిడుగులు పడి ముగ్గురు వృద్ధులుసహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ఢిల్లీలో 15 విమానాల దారిమళ్లింపు

ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం బలమైన గాలులుతో కూడిన వర్షాలు కురిసాయి. దీంతో అనేక ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు విరిగిపడటంతోపాటు, విమాన సర్వీసులు కూడా ప్రభావితమయ్యాయి. 15 విమానాలను దారిమళ్లించగా, అనేక విమానాలు ఆలస్యంగా నడిచాయి. ప్రజలు ఇళ్లలో ఉండాలని, ప్రయాణాలకు దూరంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.



స్వర్ణ కిరీటాలను బహుకరిస్తున్న పి ప్రతాప్‌రెడ్డి కుటుంబసభ్యులు

వైభవంగా సీతారాముల కల్యాణం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్‌పి ఇజి.అశోక్‌కుమార్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

శివధనుర్బాలంకారంలో కోదండరాముడు


ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శివధనుర్బాలంకారంలో రాములవారిని ఊరేగించారు. చెక్కభజనలు, కోలాటాలు, కేరళ డ్రమ్స్ నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది.

సీత, రామ, లక్ష్మణులకు స్వర్ణ కిరీటాలు

సీత, రామ లక్ష్మణులకు రూ.6.60 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన స్వర్ణ కిరీటాలను పెన్నా సిమెంట్స్ అధినేత పి.ప్రతాప్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు విరాళంగా అందించారు. దాదాపు ఏడు కేజీల బంగారంతో తయారు చేసిన కిరీటాలను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ జె.శ్యామలరావులకు అందజేశారు.

'సైబర్ బానిసత్వం' నుంచి విముక్తి

- బయటపడిన 60మందికి పైగా భారతీయులు
- ఐదుగురు ఏజెంట్లు అరెస్టు



ముంబయి : మయన్మార్‌లో 'సైబర్ బానిసత్వం'లోకి బలవంతంగా దించబడిన 60మందికి పైగా భారతీయులను మహారాష్ట్ర పోలీసు శాఖలోని సైబర్ విభాగ అధికారులు రక్షించారు. ఇందుకు సంబంధించి ఐదుగురు ఏజెంట్లను అరెస్టు చేశారు. వీరిలో ఒక విదేశీ జాతీయుడు కూడా వున్నాడు. దీనిపై మూడు ఎఫ్‌ఐఆర్‌లను మహారాష్ట్ర సైబర్ విభాగం నమోదు చేసిందని సంబంధిత అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా బాధితులతో సంబంధాలు పెట్టుకున్న ఈ ఏజెంట్లు థాయిలాండ్‌లో, ఇతర తూర్పు ఆసియా దేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగాల ఆశ చూపించి వారిని ఈ రొంపిలోకి లాగారని సదరు అధికారి తెలిపారు. బాధితులకు పాస్‌పోర్టులను, విమాన టిక్కెట్లను ఏర్పాటు చేసిన ఏజెంట్లు వారిని టూరిస్ట్ వీసాలపై థాయిలాండ్‌కు పంపారు. ఆ దేశంలోకి అడుగు పెట్టగానే వారిని మయన్మార్ సరిహద్దులకు తీసుకెళ్లారు. అక్కడ నుండి చిన్న చిన్న బోట్లలో ఒక నదిని దాటించారు. మయన్మార్‌లోకి చేరిన తర్వాత, బాధితులందరినీ సాయుధ రెబెల్ గ్రూపుల నియంత్రణలో వున్న కాంపౌండ్‌ల్లోకి తీసుకెళ్లారు. ఈ కాంపౌండ్‌లకు పకడ్బందీ కాపలా ఏర్పాట్లు వున్నాయి. ఇక అక్కడ నుండి వారితో నకిలీ కాల్స్ చేయిస్తూ డిజిటల్ అరెస్టు దగ్గర నుండి బూటకపు పెట్టుబడి పథకాల వరకు రకరకాలైన సైబర్ నేరాలకు పాల్పడేలా వారిపై ఒత్తిళ్లు తేవడం ఆరంభించారు. మయన్మార్‌లో పోలీసు అపరేషన్ ఎలా సాగిందన్న వివరాలు వెల్లడించకుండా బాధితులను కాపాడినట్లు మాత్రమే ఆ అధికారి తెలిపారు. మహారాష్ట్ర సైబర్ విభాగం, ఇతర సంస్థలు కలిసి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయన్నారు. రిక్రూట్‌మెంట్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారిలో వెబ్ సిరీస్‌లు, టెలివిజన్ షోల్లో నటించిన నటుడు మనీష్ గ్రే అలియాస్ మాడీ వున్నాడని ఆ అధికారి తెలిపారు. భారత్‌లో కూడా ఇలాంటి ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు పథకం రచించినట్లు మరో ఏజెంట్ ద్వారా తెలిసిందని, దర్యాప్తు సాగుతోందని చెప్పారు. బాధితులను ప్రశ్నించగా, ఇలాంటి బూటకపు కాల్ సెంటర్ కంపెనీలు, వాటి నెట్‌వర్క్ ఉందని, ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ ముసుగులో కొన్ని కంపెనీలు ఇలా పనిచేస్తున్నాయని చెప్పారు.

నేడు అమెరికా, ఇరాన్ అణు చర్చలు

- ట్రంప్ చిత్తశుద్ధి ఎంతో చూస్తామన్న ఇరాన్



టెహరాన్ : అమెరికా నుండి తీవ్రంగా ఒత్తిడి వస్తున్నప్పటికీ అమెరికాతో జరిపే అణు చర్చల్లో దౌత్యానికి నిజమైన అవకాశం ఇస్తున్నట్లు ఇరాన్ శుక్రవారం పేర్కొంది. మస్కట్‌లో శనివారం నిర్వహించనున్న ఈ చర్చల ప్రధాన అజెండా ఇరుదేశాల మధ్య అణు ఒప్పందం కుదుర్చుకోవడమే. ఇరాన్‌తో చర్చలకు సిద్ధమైనట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ఆకస్మికంగా ఒక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాక్వెయి ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. "చిత్తశుద్ధితో, పూర్తి స్థాయిలో అప్రమత్తతతో దౌత్యానికి నిజమైన అవకాశం ఇస్తున్నాం. అమెరికా ఘర్షణాయుత వైఖరిని అవలంబించినప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రశంసించాలి." అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ చర్చలకు అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి నేతృత్వం వహిస్తారు. చర్చలు ప్రత్యక్షంగా జరగాలని ట్రంప్ పట్టుబట్టగా, పరోక్షంగానే జరగాలని అరగ్చి తేల్చిచెప్పారు. మరోపక్క ఇరాన్‌పై ఆంక్షల విధానాన్ని వాషింగ్టన్ కొనసాగిస్తునే వుంది. ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మిలటరీ చర్య తీసుకోవడం తప్పనిసరని బుధవారం ట్రంప్ హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపుల వల్ల ఉపయోగమేమీ వుండదని, ఐక్యరాజ్య సమితి అణు పర్యవేక్షక సంస్థకు చెందిన ఇన్‌స్పెక్టర్లు ఇరాన్‌కు వచ్చి తనిఖీలు జరపకుండా అడ్డగించడంతో సహా అనేక చర్యలు తీసుకునేందుకు అవకాశాలు కల్పించినట్లవుతుందని ఇరాన్ మత పెద్ద ఖమేని గురువారం హెచ్చరించారు. అటువంటి చర్యలు ఇరాన్ వైపు నుండి కవ్వింపు చర్యలుగా పరిగణించాల్సి వస్తుందని అమెరికా పేర్కొంది. ఈ చర్చల పట్ల ముందుగానే తాము ఎలాంటి అంచనాలకు, అభిప్రాయాలకు రావడం లేదని ఇరాన్ ప్రతినిధి బాక్వెయి వ్యాఖ్యానించారు. శనివారం నాటి సమావేశంలో అమెరికా చిత్తశుద్ధి, నిజాయితీ ఎంతలా వుందో అంచనా వేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దానికి అనుగుణంగానే తమ తదుపరి చర్యలు వుంటాయని తెలిపారు.

ప్రజల ప్రాథమిక హక్కుల గురించీ ఆలోచించండి

- ఇడిపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : ప్రజల ప్రాథమిక హక్కుల గురించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ ఆపూర్తి నిగమ్ (ఎన్‌ఎఎన్) కుంభకోణం కేసును చత్తీస్‌గఢ్ నుండి ఢిల్లీకి బదిలీ చేయాలని కోరుతూ ఇడి దాఖలు చేసిన పిటిషన్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వ్యక్తుల కోసం ఉద్దేశించిన రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్‌ను మీరెలా దాఖలు చేస్తారంటూ ఇడిని జస్టిస్ అభయ్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 32వ అధికరణ రాజ్యాంగ పరిష్కారాల హక్కుకు హామీ కల్పిస్తుంది. తమ ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడినట్లైతే సుప్రీంకోర్టును పరిష్కారం కోరడానికి వ్యక్తులకు సాధికారత కల్పిస్తోంది. తమ హక్కుల అమలు కోసం నేరుగా సుప్రీంను ఆశ్రయించేందుకు వారిని అనుమతిస్తోంది. సుప్రీం బెంచ్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు అనుమతి కోరారు. ఇడికి కూడా ప్రాథమిక హక్కులు వున్నాయని వ్యాఖ్యానించారు. ఇడికి ప్రాథమిక హక్కులు వుంటే అది ప్రజల ప్రాథమిక హక్కులు గురించి కూడా ఆలోచించాలని బెంచ్ వ్యాఖ్యానించింది. ఆ తర్వాత పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి రాజును కోర్టు అనుమతించింది. చత్తీస్‌గఢ్‌లోని కేసులో మాజీ ఐఎఎస్ అధికారి అనీల్ తుటేజ తనకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను దుర్వినియోగం చేశారని ఇడి గతేడాది పేర్కొంది. చత్తీస్‌గఢ్‌లోని కొన్ని రాజ్యాంగ శక్తులు హైకోర్టు న్యాయమూర్తితో టచ్‌లో వుంటూ మనీ లాండరింగ్ కేసులోని నిందితులకు న్యాయపరమైన ఉపశమనం కలిగేలా చూస్తున్నారంటూ ఇడి ఇటీవల ఆరోపించింది. ఆ కేసును చత్తీస్‌గఢ్ నుండి ఢిల్లీకి బదిలీ చేయాలని కోరింది.

పారిశ్రామికోత్పత్తి భారీ పతనం

(మొదటి పేజీ తరువాయి)

వినియోగానికి కూడా ప్రజలు తటపటాయించే పరిస్తితి రావడం ఆర్థిక తిరోగమనానికి నిదర్శనంగాచెబుతున్నారు. మొత్తం మీద తయారీ రంగంలో వృద్ధి 2.9 శాతానికి మందగించింది. గతేడాది ఇదే నెలలో 4.9 శాతం పెరుగుదల నమోదయ్యింది. ఇదే నెలలో గనుల రంగం ఉత్పత్తి 8.1 శాతంగా చోటు చేసుకోగా, ఫిబ్రవరిలో ఏకంగా 1.6 శాతానికి క్షీణించింది. 2024 ఫిబ్రవరిలో 7.6శాతం వృద్ధిని కనపరిచిన విద్యుత్ రంగం తాజాగా 3.6 శాతానికి తగ్గిపోయింది. గత ఏడాది ఇదే నెలలో మౌలిక వసతులు, నిర్మాణ రంగం ఉత్పత్తుల వృద్ధి 8.3 శాతంగా ఉండగా.. 2025 ఫిబ్రవరిలో 6.6 శాతానికి పడిపోయింది. ముడి చమురు, బొగ్గు, ఇనుము, వ్యవసాయ ఉత్పత్తులు తదితర వాటికి సంబంధించిన ప్రాథమిక వస్తువుల ఉత్పత్తి వృద్ధి 2.8 శాతానికి పడిపోయింది. ఇది అంతకుముందు ఏడాది ఫిబ్రవరిలో 5.9 శాతంగా నమోదయ్యింది. ఇదే సమయంలో కలప, స్టీల్, గ్లాస్, విలువైన లోహాలతో చేసిన తుది వస్తువులకు సంబంధించిన ఇంటర్మీడియట్ గూడ్స్ ఉత్పత్తి వృద్ధి 1.5 శాతానికి పడిపోయింది. ఈ విభాగం 2024 ఇదే నెలలో 8.6 శాతం పెరుగుదలను సాధించింది. స్థూలంగా గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో ఐఐపి వృద్ధి 4.1 శాతానికి పడిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి గీటురాయిగా భావించే పారిశ్రామికోత్పత్తి సూచీ పడిపోవడం.. మరోవైపు అమెరికా వాణిజ్య యుద్ధం ప్రతికూల పరిణామాలు ఉపాధి, ఆదాయాలను దెబ్బతీయనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అంచనాలకు భిన్నంగా....

నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వ అట్టహాస ప్రకటనల నేపథ్యంలో వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు గతంలో భారీ అంచనాలను వ్యక్తం చేశాయి. రాయిటర్‌పోల్స్‌లో పాల్గొన్న ఆర్థిక వేత్తలు నాలుగుశాతం వృద్ధిని అంచనా వేశారు. బ్లూమ్‌బెర్గ్ కూడా 3.6శాతం వృద్ధిని అంచనా వేసింది. వీరి అంచనాలకు తగ్గట్టుగానే 2025 జనవరిలో 5.01 శాతం వద్ద ధృడంగా ప్రారంభమైన వృద్ధి గణాంకాలు రెండు నెలల కాలంలోనే భారీగా పతనంకావడం విశేషం

వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలి

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలను పూలే దంపతులు కూడగట్టారని గుర్తు చేశారు. విద్యతోనే ఈ విముక్తి సాధించగలమని గట్టివాదాన్ని సమాజానికి వినిపించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని తెలిపారు. విముక్తి కోసం పోరాడాలని దళితులకు పిలుపునిచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని నేటితరం యువత ఆదర్శవంతంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జ్యోతిరావు పూలే ఆదర్శాలను పాలకులు మట్టిలో కలిపేశారని వివరించారు. మహోన్నతమైన దంపతుల ఆదర్శాలను సమాధి చేసి కేవలం వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించినంత మాత్రాన సరిపోదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో కులవ్యవస్థకు లేని గౌరవాన్ని ఆపాదించి, దానిని పునరుద్ధరించి అంటరానితనాన్ని సనాతన ధర్మం పేరుతో కాపాడే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. దళితులకు, గిరిజనులకు, వారి విజ్ఞానానికి, చదువుకొనేందుకు ఉన్న అవకాశాలను తగ్గించేస్తోందన్నారు. అమెరికా ప్రభుత్వం మనదేశ ప్రజలపై విచ్చలవిడిగా ఆంక్షలు పెడుతున్నా నోరు మెదపకుండా దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఇటువంటి ఆంక్షలు ఆనాటి బ్రిటీష్ పాలనలో ఉంటే వాటిని ఎదిరించి నిలబడిన స్వాతంత్ర్యోద్యమ నాయకులకు ద్రోహం చేయడం సరికాదన్నారు. కులవివక్షకు, అంటరానితనానికి, నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని చేపట్టి వాటన్నింటినీ నిర్మూలించిన రోజే పూలే దంపతులకు నిజమైన జోహార్లు అర్పించినట్టు అని తెలిపారు. నేటికీ తీవ్రమైన రూపాల్లో గ్రామాల్లో, పట్టణాల్లో కులవివక్ష కొనసాగుతోందని వివరించారు. జ్యోతిరావు పూలే దంపతులకు నివాళి అర్పించే అర్హత కేంద్ర ప్రభుత్వానికిగానీ, బిజెపి మిత్రపక్షాలకుగానీ లేదన్నారు. ఇటువంటి పాలకులను ఇంటికి పంపినప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ విద్యను ప్రతి ఒక్కరికీ అందించాలన్న ఆశయంతో పూలే దంపతులు అడుగులు వేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ, సాంస్కృతిక వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాల్లో ఈ స్పష్టత లేకపోవడం సంఘ్ పరివార్ పట్ల సైద్ధాంతిక ప్రతిఘటనను బలహీనపరుస్తుంది.

ప్రశ్న : సంఘ పరివార్‌కు వ్యతిరేకంగా సిపిఎం, వామపక్షాల వైఖరి ఎలా వ్యాప్తి చేయబోతున్నారు?

బేబి: 1990ల ప్రారంభంలో దేశ రాజకీయాల్లో బిజెపి ముప్పుగా ఎదగడం ప్రారంభించినప్పుడు, 'ఫ్రంట్‌లైన్' వారపత్రిక ఆరెస్సెస్ అంటే ఏమిటి? అనే దానిపై అప్పటి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి రాసిన 'వాట్ ఈజ్ హిందూ స్టేట్' అనే వ్యాసం ప్రచురించింది. దీనిని ఫ్రంట్‌లైన్ స్వయంగా పుస్తకంగా ప్రచురించింది. ఇప్పుడు పార్టీ మహాసభ సందర్భంగా దాన్ని తిరిగి ప్రచురించారు. బిజెపి వేరే తరహా రాజకీయ పార్టీ అని సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు పదే పదే చెబుతున్నాయి. బూర్జువా మీడియా ఆధిపత్యం ఉన్న భారతీయ సమాజంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల గురించి సిపిఎం, వామపక్షాల వైఖరి తగినంతగా వ్యాప్తి చెందడం లేదు. ఈ బలహీనతను అధిగమించడానికి పెద్దయెత్తున కృషి చేయాలని పార్టీ మహాసభ నిర్ణయించింది. ఇది ఒక సాంస్కృతిక, రాజకీయ లక్ష్యం. ఇది కేవలం సాంస్కృతిక సంఘాలపై ఆధారపడటంతోనే నిర్వహించలేం. అన్ని వర్గ, ప్రజా సంఘాల్లో వివిధ స్థాయిలలోని అంశాల్లో సాంస్కృతిక జోక్యానికి ఒక సంస్థాగత వ్యవస్థ ఉండాలి. ప్రస్తుతం ఇది ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో జరుగుతోంది. అయితే, సంఘ్ పరివార్ సంస్థలు వ్యక్తిగతంగా, సమిష్టిగా ఇళ్లలో, కార్యాలయాల్లో నిర్వహించే సూక్ష్మమైన పనిపై దృష్టి పెట్టాలి. దీనిని ఎదుర్కోవడానికి, ప్రజలను వారి నివాస ప్రాంతాల్లో సందర్శించడం, వారితో ఓపికగా మాట్లాడటం, మతపరమైన ఆలోచనల పట్టు నుండి వారిని విడిపించడానికి కార్యక్రమాలను సిద్ధం చేయడంతో మనం వివిధ స్థాయిలలో క్రమపద్ధతిలో పనిచేయాలి.

ప్రశ్న: పెరుగుతున్న బిజెపి ప్రభావాన్ని సమర్థవంతంగా ఎలా బలహీనపరచవచ్చు?

బేబి: కేంద్రంలో అధికారంలో ఉండటం వల్ల కొన్ని వర్గాల ప్రజలు బిజెపి వైఖరిని అంగీకరించడానికి మార్గం సుగమం చేసింది. సంఘ్ పరివార్ చేతులకు గాంధీజీ రక్తం మరకలు ఉన్నాయని, గాంధీజీని చంపిన తుపాకీతోనే గుజరాత్ మారణహోమం చేసి కల్బుర్గి, గౌరీ లంకేష్, దభోల్కర్ ప్రాణాలను తీశారని మన దేశంలో అందరికీ అర్థమయ్యేలా చేస్తేనే కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకున్న వారిని మనం తరిమికొట్టగలం. వారు రెండు శాతం ఓట్ల తేడాతో కేంద్రంలో అధికారంలో ఉన్నారు. అందువల్ల, మోడీని ఓడించగల శక్తులు ఆయన చుట్టూ ఉన్నాయనే వాస్తవిక, ఆశావాద నమ్మకాన్ని మనం ప్రజల్లో కలిగించగలగాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం ముగియదు. ఈ శక్తులు దశాబ్ద కాలంగా క్రమపద్ధతిలో భారతీయ సమాజంలోని దాదాపు ప్రతి భాగాన్ని మతోన్మాదంతో విషపూరితం చేశారు. భారతీయ సమాజాన్ని పరిరక్షణకు ఒక భారీ రాజకీయ, సాంస్కృతిక చికిత్సను చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిని సాధించడానికి సిపిఎం, భావసారూప్యత కలిగిన పార్టీలు, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంస్థలు, వ్యక్తులు ఐక్యంగా ఉండాలని పార్టీ ప్రతిపాదిస్తుంది. దీనిని సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే సిపిఎం, వామపక్షాలు పదిరెట్లు బలాన్ని పొందాలి.

ప్రశ్న: సోషలిజమే ప్రత్యామ్నాయం అనేదాన్ని దేశంలో ఎలా ప్రచారం చేయబోతున్నారు?

బేబి: సాధారణంగా ప్రపంచ పరిస్థితిని అంచనా వేసేటప్పుడు, కొన్ని చోట్ల తీవ్ర మితవాద పెరుగుదలను ఉదహరిస్తూ కమ్యూనిస్టులు, వామపక్షాలకు భవిష్యత్తు లేదని వాదించేవారు ఉన్నారు. కానీ కమ్యూనిస్టులు, వామపక్షాల ప్రభావం లేని ప్రపంచం భవిష్యత్తు గురించి ఆలోచనాపరులైన ప్రజలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలు కోట్లాది మంది ప్రజలపై ఎన్ని భరించలేని కష్టాలను రుద్దుతున్నాయి? ఆక్స్‌ఫామ్ వంటి స్వతంత్ర పరిశోధనా బృందాలు దీనిపై గణాంకాలను అందిస్తాయి. ప్రపంచ జనాభాలో 95 శాతం మంది సంపద మొత్తం కంటే, ఒక శాతం మంది అత్యంత ధనవంతుల సంపద ఎక్కువ. బిలియనీర్ల సంపద ప్రతిరోజూ 2.7 బిలియన్ డాలర్లు పెరుగుతోంది. మరోవైపు ద్రవ్యోల్బణం 1.7 బిలియన్ల కార్మికుల వాస్తవిక ఆదాయాన్ని తగ్గిస్తోంది. ఔషధాలు, వ్యవసాయం, సాంకేతికత వంటి రంగాలలో ఒక సమూహం ప్రపంచ గుత్తాధిపత్యాన్ని సాధించింది. ఏడు సోషల్ మీడియా, టెక్నాలజీ, చిప్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 12 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. వారు ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించి ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. రాజకీయ జోక్యం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు పన్నులు తగ్గించడం ద్వారా, కార్మిక చట్టాలను బలహీనపరచడం ద్వారా కార్పొరేట్లకు సహాయం చేస్తున్నాయి.

ప్రపంచంలో ఉక్రెయిన్, గాజాలో దోపిడీ వ్యవస్థ సృష్టించే యుద్ధాలు, మారణహోమాన్ని మనం చూస్తున్నాము. అధిక లాభాల కోసం సహజ వనరులను దోపిడీ చేయడం వెనుక పెట్టుబడిదారీ విధానం చోదక శక్తిగా ఉంది. ప్రపంచ జనాభాలో 25 శాతం మంది మరింత సమానత్వ సమాజాలను నిర్మించడానికి మార్గాలను అన్వేషిస్తున్న దేశాలలో నివసిస్తున్నారని అంచనా. అందువల్ల, ప్రపంచ పరిణామాలను జాగ్రత్తగా అంచనా వేసే వారికి పెట్టుబడిదారీ విధానం దుస్థితిని అంతం చేయవచ్చని ఆశ ఉంటుంది.

ప్రశ్న : ప్రపంచంలో దేశాల మధ్య వైరుధ్యాలు వేర్వేరుగా ఉన్నాయి కదా!, అన్ని దేశాల్లో పరిస్థితులను ఒకేలా అర్థం చేసుకోవడం సాధ్యమా?


బేబి: అవును, ప్రపంచంలోని దేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. అన్ని దేశాల్లో పరిస్థితులు ఒకేలా ఉండవు. కానీ అనేక దేశాల్లో ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. అందుకే ప్రతి దేశానికి అనువైన రూపంలో సమానత్వ సమాజాన్ని అభివృద్ధి చేయవచ్చని సిపిఎం ధృడంగా విశ్వసిస్తుంది. భారత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమానత్వ సమాజం, సోషలిస్ట్ సమాజం, జనతా ప్రజాస్వామ్య మార్గం ద్వారా నిర్మించాలనే ఆలోచనను పార్టీ 24వ మహాసభ ముందుకు తెచ్చింది. ప్రపంచంలోలానే, భారతదేశంలో 2017-18లో మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా 32 శాతం. 2024-25లో ఇది 26.5 శాతానికి తగ్గింది. 2014-15లో 20.8 శాతంగా ఉన్న ఆదాయపు పన్ను వాటా 2024-25లో 30.9 శాతానికి పెరిగింది. కార్పొరేట్ పన్ను కోతల వల్ల ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.1.45 లక్షల కోట్లు నష్టపోతోంది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అసమానతలు కలిగిన దేశంగా మారింది. జనాభాలో ఒక శాతం మంది నియంత్రణలో దేశ ఆదాయంలో 22.6 శాతం ఉంది. దేశ సంపదలో 40.1 శాతం వారివద్దే ఉంది.

ప్రశ్న : భారతదేశం బలమైన మత ప్రభావం కలిగిన దేశం. కమ్యూనిస్టులు, సోషలిస్టులు మతం పట్ల అనుసరిస్తున్న వైఖరి గురించి జరుగుతున్న కొన్ని ప్రచారాలు సిపిఎం బలోపేతానికి ఆటంకం కలిగించడం లేదా?

బేబి: కమ్యూనిస్టులు మత వ్యతిరేకులనేది నిరాధారమైన ప్రచారం. కమ్యూనిస్టులు మత విశ్వాసాలకు వ్యతిరేకం కాదు. మతం పేరుతో జరుగుతున్న ఉన్మాద చర్యలకు, మతోన్మాదానికి, మత విద్వేషాలకు వ్యతిరేకం. 1864లో ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ (ఫస్ట్ ఇంటర్నేషనల్)ను కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, మిఖాయిల్ బకునిన్ ఏర్పాటు చేసినప్పుడు దీనిని స్పష్టం చేశారు. రష్యన్ విప్లవకారుడు బకునిన్ ఇంటర్నేషనల్‌లో మతపరమైన భావజాలాలతో సంబంధం లేని వారిని మాత్రమే సంస్థలో సభ్యత్వంలోకి చేర్చాలని వాదించారు. మార్క్స్, ఎంగెల్స్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల విముక్తి కోసం పోరాటంలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్న అన్ని మతపరమైన విశ్వాసులను సంస్థలో చేర్చవచ్చని మార్క్స్, ఎంగెల్స్ వాదించారు. బకునిన్ వైఖరిని అంగీకరించే యాంత్రిక భౌతికవాదాన్ని సిపిఎం సమర్థించదు. మత విశ్వాసులను సమీకరించడంతో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడం, విస్తరించడం సిపిఎం వైఖరి. ఇది 24వ పార్టీ మహాసభ డాక్యుమెంట్ నిస్సందేహంగా స్పష్టం చేసింది.

డ్రగ్స్‌కు జీవితాంతం దూరంగా ఉంటాం

- టీచరమ్మకు విద్యార్థుల 'వీడ్కోలు' కానుక
- చిన్నారులకు కేరళ సిఎం పినరయి విజయన్ ప్రశంస



టీచర్ సైనబా బివి తల మీద చేయివేసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేస్తున్న విద్యార్థి

ఇడుక్కి : కేరళలోని ముస్లిం ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎంఇఎస్) స్కూల్ విద్యార్థులు క్లాస్ టీచర్‌కు విన్నూత్నమైన వీడ్కోలు కానుక ఇచ్చారు. జీవితాంతం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ టీచర్‌పై ప్రమాణం చేసి మాట ఇచ్చారు. విద్యార్థులు ఇచ్చిన కానుకపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సైతం విద్యార్థుల చర్యను ప్రశంసించారు. కేరళలోని ఇడుక్కి జిల్లా వందన్మేడు వద్ద ఉన్న ముస్లిం ఎడ్యుకేషన్ సొసైటీ (ఎంఇఎస్) హయ్యర్ సెకండరీ స్కూల్‌లో సైనబా బివి టీచర్‌గా పనిచేశారు. 9వ తరగతి బి సెక్షన్‌కు బాధ్యతలు నిర్వహించిన ఆమె మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా తరగతిలోని 45 మంది విద్యార్థులు టీచర్ తలపై చేయివేసి మాదక ద్రవ్యాలకు జీవితాంతం దూరంగా ఉంటామని మాట ఇచ్చారు. దీనికి గురించి టీచర్ మాట్లాడుతూ విద్యార్థులంగా ఈ ప్రతిజ్ఞలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 'మాదక ద్రవాల్యకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలనే ఆలోచన అకస్మాత్తుగా వచ్చింది. ప్రస్తుతం మన సమాజంలో మాదక ద్రవ్యాలు తీవ్రమైన సమస్య. నేను ఒక అర్థవంతమైన సందేశాన్ని ఇవ్వాలనుకున్నాను' అని తెలిపారు. సైనబా బివి 2021 రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గెలుచుకున్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

సిఎం సహా పలువురి ప్రశంసలు

విద్యార్థుల చర్యను తల్లిదండ్రులతో పాటు సిఎం, రాష్ట్రవ్యాపంగా విద్యావేత్తలు, పిల్లల హక్కుల న్యాయవాదులు ప్రశంసించారు. విలువ ఆధారిత విద్య, ప్రజారోగ్య అవగాహనకు ఈ చర్య దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. మాదకద్రవ్య రహిత సమాజం పట్ల ప్రేమ, నిబద్ధతకు స్ఫూర్తిదాయకమైన చర్య అని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. 'ఇటువంటి చర్యలు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటంలో మనందరినీ ప్రేరేపిస్తాయి' అని పేర్కొన్నారు.



జ్యోతిరావు పూలేకు కెవిపిఎస్ ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చదువుతోనే అంటరానితనం, కులవివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని గుర్తించిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా విజయవాడలోని క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరికీ చదువు నేర్పించి కుల వివక్ష నిర్మూలించడానికి పూలే జీవితాంతం కృషి చేశారని తెలిపారు. కుల రహిత సమాజం కోరుకున్న మహనీయుడని చెప్పారు. దేశంలో ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలు జరుపుతూ సనాతన ధర్మం పేరుతో ప్రజలపైన మనుధర్మాన్ని రుద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. పూలేకు నివాళులర్పించిన వారిలో సంఘం ఉపాధ్యక్షులు జి నటరాజ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంభం ప్రసన్న కుమార్, ఎ అశోక్, రామ్మోహనరావు, దళిత జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసాని గణేష్ బాబు, కనకరాజు, అనిల్ కుమార్, సామాజిక కార్యకర్త చౌడికి కృష్ణ, పిఆర్‌పిఎస్ జాతీయ నాయకులు జైబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఏసు, కెవిపిఎస్ నాయకులు జి అమృతరావు తదితరులు ఉన్నారు.

రాణాకు 18 రోజుల కస్టడీ

- ఇతర నగరాల్లోనూ బాంబు పేలుళ్లకు కుట్ర : కోర్టుకు తెలిపిన ఎన్‌ఐఎ

ముంబయి : ముంబయి ఉగ్రదాడులు కేసులో సూత్రధారి తహవ్వూర్ రాణాకు ఢిల్లీలోని కోర్టు 18 రోజుల కస్టడీ విధించింది. భారత్ ప్రభుత్వ విజ్ఞప్తి నేపథ్యంలో శుక్రవారం అతనిని భారత్‌కు అమెరికా అప్పగించిన సంగతి తెలిసిందే. అమెరికా నుంచి ప్రత్యేక విమానం ద్వారా గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న రాణాను ఎన్‌ఐఎ అదుపులోకి తీసుకుంది. గురువారం రాత్రే రాణాను పాటియాలా హౌస్‌లోని ఎన్‌ఐఎ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రత్యేక న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ ముందు ఎన్‌ఐఎ వాదనలు వినిపించింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇలాంటి దాడులకు కుట్రపన్నాడని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) ఆరోపించింది. ముంబయి దాడుల కుట్రపై పూర్తి విచారణ చేయడానికి రాణాను 20 రోజుల కస్టడీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. 17 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనలు తెలుసుకోవడానికి రాణాను వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపింది. రాణాను 18 రోజుల ఎన్‌ఐఎ కస్టడీకి న్యాయమూర్తి అప్పగించారు. ప్రతి 24 గంటలకు ఒకసారి రాణాకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి రోజు న్యాయవాదిని కలవడానికి అనుమతి ఇవ్వాలని ఎన్‌ఐఎను ఆదేశించారు. సాఫ్ట్-టిన్ పెన్ను మాత్రమే వినియోగించుకునేందుకు రాణాకు న్యాయమూర్తి అనుమతించారు. ఈ సందర్భంగా కోర్టు వద్ద భారీ స్థాయిలో భద్రతను ఏర్పాటు చేశారు. కోర్టు 18 రోజుల కస్టడీ మంజూరు చేయడంతో ఎన్‌ఐఎ ప్రధాన కార్యాలయానికి రాణాను తరలించారు. అక్కడ గ్రౌండ్ ఫ్లోర్‌లోని 14 x 14 సెల్‌ను కేటాయించారు. 24 గంటల నిఘా కోసం సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేశారు. 2008 నవంబర్ 26న 10 మంది ఉగ్రవాదులు ముంబయిలో వివిధ ప్రాంతాల్లో దాడులకు తెగబడ్డారు. దాదాపు 60 గంటల పాటు వివిధ ప్రాంతాల్లో నక్కి కాల్పులు జరపడంతో 166 మంది మరణించగా, 238 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదుల్లో కసబ్ తప్ప మిగిలిన వారందర్నీ భద్రతా సిబ్బంది కాల్చిచంపారు. ప్రాణాలతో పట్టుకున్న కసబ్‌కు తరువాత ఉరిశిక్ష విధించారు.



ముగ్గురు విద్యార్థుల సస్పెన్షన్ రద్దు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నిరాహార దీక్ష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ముగ్గురు విద్యార్థుల సస్పెన్షన్ రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యాన నిరవధిక నిరాహార దీక్ష నిర్వహించారు. విద్యార్థులు నాడియా, అనన్, హర్షల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు శరణ్య, ఎస్‌ఎఫ్‌ఐ యూనిట్ కార్యదర్శి షెఫాలి డిమాండ్ చేశారు. వారికి ఎస్‌ఎఫ్‌ఐ అండగా ఉంటుందని తెలిపారు. వారి ముగ్గురి సస్పెన్షన్ రద్దు చేసేవరకూ మంచినీళ్లు కూడా తాగకుండా నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇది దళిత, ముస్లిం విద్యార్థులపై తీసుకున్న చర్య అని విమర్శించారు. సస్పెండ్ అయిన విద్యార్థులు ఈ విషయాన్ని ఢిల్లీ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయం విచారణను రెండుసార్లు ఆలస్యం చేసి, ముగ్గురు విద్యార్థుల విద్యా భవిష్యత్తును పణంగా పెట్టిందని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు విమర్శించారు.



మీకోసం

వాష్ బేసిన్‌లో రంధ్రాలు మూసుకుపోయినప్పుడు వేడినీటిలో కాస్తంత ఉప్పు కలిపి ఆ నీటిని వాష్ బేసిన్‌లో పోయాలి. రంధ్రాలు తెరుచుకుని వాష్ బేసిన్ శుభ్రపడుతుంది.

జీవన సౌరభం

ఇతరులకు స్వేచ్ఛను నిరాకరించే వారు తాము స్వేచ్ఛ పొందటానికి అర్హులు కారు.

JEEVANA జీవన the family

మెప్పులు



విత్తనాలు నాటాలోయ్
మొక్కలు మొలిపించాలోయ్
పెత్తనాలు మానాలోయ్
శ్రద్ధగ పనిచెయ్యాలోయ్

అంజనాలు నమ్మొద్దోయ్
మూఢనమ్మకాలొదులోయ్
కార్ఖానాలు పెంచాలోయ్
ఉపాధులను పొందాలోయ్


అనుమానాలు వదలాలోయ్
అసలు నిజం తేలాలోయ్
అభిమానాలు చూపాలోయ్
అందరి ప్రేమ పొందాలోయ్

భోజనాలు చెయ్యాలోయ్
పుష్టినెంతో పొందాలోయ్
విధానాలు నేర్చాలోయ్
విజ్ఞానం పొందాలోయ్

మంచి స్నేహం చెయ్యాలోయ్
సాయపడుతు ఉండాలోయ్
విమానాలు నడపాలోయ్
గగనంలో ఎగరాలోయ్

వందనాలు చెయ్యాలోయ్
పెద్దలను గౌరవించాలోయ్
బహుమానాలు పొందాలోయ్
మెప్పులందుకోవాలోయ్!

- ఎన్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి,
80745 26849.



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



- మానవి,
5వ తరగతి,
కవిరాయని పబ్లిక్ స్కూలు,
పార్వతీపురం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సాంకేతికతను అందిపుచ్చుకుని మనిషి ఎంతో అభివృద్ధి చెందుతున్నాడు. రాకెట్లు, మెరైన్లు, అంతరిక్ష ప్రయోగాలను దాటి ఆర్టిఫిషియల్ ఇంటిల్‌జెన్స్ (ఏఐ) రాక ఎన్నో అద్భుతాలకు కేంద్రంగా మారింది. అయితే ఆ అభివృద్ధి మానవ వినాశనం కోరితే.. ముఖ్యంగా ఒక జాతి మరో జాతిని నాశనం చేసే ఆయుధంగా మారితే.. ఉపేక్షించే వీలు లేదు. అది ఎంత శక్తిమంతమైనా, దాని రూపకర్తలు ఎంతటి మేధావులైనా ఆ విధానాలను ఖండించాల్సిందే.. ఆ ఆలోచనలని తిప్పికొట్టాల్సిందే. సరిగ్గా ఇటీవల మైక్రోసాఫ్ట్ సంస్థ 50వ వార్షికోత్సవ బహిరంగ సభలో ఇదే జరిగింది. మైక్రోసాఫ్ట్ సంస్థ ఇజ్రాయిల్ మిలిటరీకీ ఎఐ టెక్నాలజీ విక్రయానికి పూనుకుంది. ఈ చర్యకి వ్యతిరేకంగా వార్షికోత్సవ సభలో ఇద్దరు మహిళా ఉద్యోగులు ఇబ్తిహాల్ అబౌసాద్, వానియా అగర్వాల్ నిరసనలు తెలిపారు. తమ వాణిని చాలా బలంగా వినిపించారు.

... ఈ ఇద్దరికీ జేజేలు!



వానియా అగర్వాల్ | ఇబ్తిహాల్ అబౌసాద్

'మీ చేతులకు రక్తం అంటుకుంది.. షేమ్ ఆన్ యు' అంటూ సంస్థ ఉద్యోగి ఇబ్తిహాల్ అబౌసాద్ బిగ్గరగా అరుస్తూ సంస్థ మాజీ సిఇఒ స్టీవ్ బామర్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఆమె ఆక్రోశిస్తున్నప్పుడు బహుశా అక్కడున్న వారందరికీ, ఆ వీడియో చూస్తున్న ప్రపంచ జనాభాకి పాలస్తీనీయులకు జరిగిన అన్యాయం క్షణకాలమైనా కళ్లముందు మెదిలేవుంటుంది.

ఒప్పందాన్ని వ్యతిరేకించడంతోనే అబౌసాద్ సరిపెట్టలేదు. 'ఒకపక్క గాజాలో మరణ మృదంగం వినిపిస్తుంటే, అందుకు ఇజ్రాయిల్ మిలటరీకి సాయం చేసిన మైక్రోసాఫ్ట్ సంస్థ సిగ్గుపడాలి' అని నినదించారు. 'మారణహోమం కోసం ఏఐని ఉపయోగించడం ఆపండి' అని బిగ్గరగా కేకలు వేశారు.



ఆ తరువాత మరో ఉద్యోగి వానియా అగర్వాల్ కూడా బిల్‌గేట్స్, సత్య నాదెళ్ల, స్టీవ్ బామర్ ఒకే వేదికపై ఆసీనులై సంస్థ సాధించిన విజయాలు ఏకరువు పెడుతున్న వేళ తన గళాన్ని విప్పారు. సంస్థ లక్ష్యంపైనే ఆమె విమర్శనాస్త్రాలు సంధించారు.

'మానవులు అభివృద్ధి చెందేలా వారికి అధికారాలు కల్పించడం' సంస్థ లక్ష్యంగా ఉంది. దీనిపైనే ఆమె ప్రశ్నించారు. 'ఏ వ్యక్తులకు మీరు అధికారం ఇస్తున్నారు? వర్ణ వివక్షను అమలు చేసే పాలనలను మన సంస్థ స్వాగతిస్తుందా? యుద్ధ నేరాలు, మారణహోమం ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి మద్దతు ఇస్తుందా? మైక్రోసాఫ్ట్ సంస్థ రానురాను డిజిటల్ ఆయుధాలు సరఫరా చేసే ఉత్పత్తిదారుగా మారిపోయింది. సాంకేతికత పేరుతో అణచివేత, జాతి ప్రక్షాళనకు సహాయపడే నిఘా వ్యవస్థలకు సహాయం చేస్తోంది' అని ఆమె తీవ్రంగా విమర్శించారు.

భారతీయ సంతతికి చెందిన వానియా సంస్థలో ఏడాదిన్నర నుండి విధులు నిర్వర్తిస్తున్నారు. సంస్థ కార్యకలాపాలను తీవ్రంగా నిరసించిన వానియా 50వ వార్షికోత్సవ సభలో దిగ్గజ మేధావుల ఎదుట తన గొంతును బలంగా వినిపించారు. 'మైక్రోసాఫ్ట్ టెక్నాలజీతో గాజాలో యాభైవేల మంది పాలస్తీనియన్లు హత్య చేయబడ్డారు. మీకు ఎంత ధైర్యం? వాళ్ల రక్తంతో మీ చేతులు తడిసిపోయాయి. ఈ మానవ హననాన్ని ఇకనైనా ఆపండి. ఇజ్రాయెల్‌తో సంబంధాలను తెంచుకోండి' అని అరుస్తున్న వానియాని సిబ్బందిని బలవంతంగా బయటికి తీసుకెళ్లారు.

పాలస్తీనీయుల దుర్భర జీవితాలను కళ్లకుకట్టిన అసోసియేటెడ్ ప్రెస్ నివేదికలను వానియా ఈ సందర్భంగా ఉదహరించారు. ఇజ్రాయెల్ వర్ణవివక్ష పాలనను, గాజాలో పాలస్తీనియన్ల మారణహోమాన్ని ప్రారంభించడంలో మైక్రోసాఫ్ట్ కీలక పాత్ర పోషించిందని ఆ నివేదికలో స్పష్టం చేశారు.

ఏప్రిల్ 4న సంస్థ వార్షికోత్సవం ముగిసిన తరువాత గంటల వ్యవధిలోనే ఈ ఇద్దరు ఉద్యోగులకు లేఆఫ్ లెటర్లు జారీచేశారు. ఉద్యోగినులు లేవనెత్తిన అంశాలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేని మైక్రోసాఫ్ట్ సంస్థ ఆ లేఖలో ఈవిధంగా ప్రస్తావించింది. 'ఖ్యాతిని పొందడానికి వీరు ఎంతో తహతహలాడిపోయారు. అందుకే కొన్ని లక్షల మంది ఎదురుచూస్తున్న పెద్ద కార్యక్రమానికి అంతరాయం కలిగించేలా ప్రవర్తించారు. ఈ దుస్సాహసాన్ని మేం సహించం. వీరిలో ఒక ఉద్యోగి తన రాజీనామాని ప్రకటించారు. అయితే అందులో ప్రస్తావించిన తేదీ కంటే 5 రోజుల ముందుగానే ఆమెని మేం విధులు నుంచి తొలగిస్తున్నాం' అని రాశారు. తప్పును ఎత్తిచూపితే సహించలేని ఆధిపత్య ధోరణి ఈ లేఖలో కనిపిస్తోంది.

ప్రపంచంలోనే అతి పెద్ద సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్. అటువంటి సంస్థ చేసే కార్యకలాపాలపై తమ నిరసనను వ్యక్తపరిచిన ఈ మహిళా ఉద్యోగుల ధైర్యానికి హాట్సాఫ్ చెప్పాల్సిందే. ఉద్యోగం పోతుందని తెలిసినా అన్యాయాన్ని ఎదిరించాల్సిందేనని గళమెత్తిన ఈ ధీరవనితలు ప్రశంసలకు అర్హులు. సాంకేతికత పేరుతో మానవ హననానికి కారణమవుతున్న వ్యక్తుల, సంస్థల చర్యలకు ఈ సంఘటన చెంపపెట్టు.



చదువులో టాపర్


వానియా ఈ ఘటన తరువాత తన ట్విట్టర్, ఈమెయిల్ ఖాతాలను నిలుపుదల చేశారు. గతంలో ఆమె ఖాతాలో ఉన్న సమాచారం మేరకు ఆమె మైక్రోసాఫ్ట్ ఉద్యోగిగా కెరియర్ ఎంచుకోక ముందు టీ కన్సల్టెంట్‌లో పనిచేశారు. 2015లో కొన్ని నెలల పాటు సోషల్ మీడియా మేనేజర్‌గా ఉన్నారు. మెడికల్ అసిస్టెంట్‌గా, రిసెప్షనిస్ట్‌గా కూడా పనిచేశారు. 2018లో అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా ఇంటర్న్‌షిప్ చేశారు. ఆ తరువాత అదే కంపెనీలో ఫుల్‌టైం జాబ్ సాధించారు. 2023 నుండి మైక్రోసాఫ్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. తాజా చర్చ తరువాత 2025 ఏప్రిల్ 11న తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఆమె 2016-19 మధ్య కాలంలో అరిజోనా యూనివర్శిటీలో బాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్ చేశారు. విద్యలో ఎంతో ప్రతిభతో రాణించే వానియా 2017లో గ్రేస్ హోపర్ కాన్ఫరెన్స్‌కి హాజరైన 35 మంది విద్యార్థుల్లో ఒకరు. యూనివర్శిటీ స్కాలర్‌షిప్‌కి ఎంపికైన వారికి మాత్రమే ఈ అర్హత ఉంటుంది.



ఆర్ఆర్ఆర్ విజువల్‌తో 'ఆస్కార్' కొత్త అవార్డు

సినీరంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే అకాడమీ అవార్డుల వేదిక ఆస్కార్ కొత్తగా స్టంట్ డిజైన్ విభాగాన్ని చేర్చుతున్నట్లు ప్రకటించింది. 2028 నుంచి ఈ విభాగంలో ఆస్కార్ పురస్కారాలు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. 2027లో విడుదలయ్యే సినిమాలు ఈ విభాగంలో పోటీపడొచ్చునని తెలిపింది. ఈ మేరకు అకాడమీ గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్‌చేసింది. 'సినిమాలో స్టంట్స్ అనేవి కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇప్పుడవి ఆస్కార్‌లోనూ భాగమయ్యాయి. స్టండ్ డిజైన్ విభాగంలో పురస్కారాలు ఇవ్వనున్నాం. 2028లో జరగబోయే 100వ ఆస్కార్ వేడుకలో వీటిని ప్రధానం చేయనున్నాం' అంటూ ప్రకటించింది. ఈ మేరకు స్టంట్ డిజైన్ ఆస్కార్ అంటూ ఓ పోస్టర్ విడుదల చేసింది. ఇందులో ఆర్ఆర్ఆర్ మూవీలోని ఫొటోను ఉపయోగించింది. ఇది చూసిన ఆ సినిమా దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సంతోషాన్ని వ్యక్తంచేశారు. '2027లో రిలీజయ్యే చిత్రాలకు స్టంట్ డిజైన్ కేటగిరీలో ఆస్కార్ ఇస్తారని ప్రకటించినందుకు డేవిడ్ లెయిచ్, క్రిస్ ఓ హర, అకాడమీ సిఇఒ బిల్ క్రామర్, అధ్యక్షుడు జానెట్ యాంగ్, స్టంట్ నిపుణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆస్కార్ విడుదల చేసిన విజువల్ చూసి చాలా థ్రిల్లయ్యాను' అంటూ ట్వీట్‌చేశారు.

వేసవి కానుకగా 'హరిహర వీరమల్లు' విడుదల



పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా, నిధి అగర్వాల్ కథానాయికగా నటించిన చిత్రం 'హరి హరి వీరమల్లు'. చిత్ర నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. డబ్బింగ్, విఎఫ్ఎక్స్ పనులు కొనసాగుతున్నాయి. ఫ్రేమ్‌లకు సొబగులు అద్దుతూ, సౌండ్‌ను చక్కగా ట్యూన్ చేస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మంచి చిత్రంగా చేయటానికి చిత్ర యూనిట్ కృషిచేస్తోంది. ఈ వేసవిలో ఎండితెరపై మునుపెన్నడూ చూడని అద్భుతమైన అనుభూతిని ప్రేక్షకులకు అందించడానికి సిద్ధమవుతున్నామని చిత్రబృందం పేర్కొంది. దర్శకుడు ఎఎం జ్యోతికృష్ణ గత ఏడునెలలుగా కృషిచేస్తున్నారు. అన్ని విభాగాలను ఆయన సమన్వయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా చేయడంలో జ్యోతి కృష్ణ పాత్ర కీలకం. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్‌కళ్యాణ్ కనువిందు చేయబోతున్నారు. మే 9న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, ఎఎం జ్యోతికృష్ణ దర్శకులు. ఎఎం కీరవాణి సంగీతం. మనోజ్ పరమహంస సినిమాటోగ్రాఫర్. తోట తరణి ఆర్ట్ డైరెక్టర్. బాబీడియోల్, అనుపమ్‌ఖేర్, సత్యరాజ్, జిషుసేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నరా ఫతేహి తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఎఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.


బెదిరేది లేదు !

ట్రంప్‌పై చైనా ఆగ్రహం • అమెరికాపై టారిఫ్‌లు 125 శాతానికి పెంపు

న్యూఢిల్లీ : అమెరికా, చైనా మధ్య టారిఫ్ యుద్ధం రోజురోజుకు తీవ్రమవుతోంది. ట్రంప్ బెదిరించాలని చూస్తే బెదిరే వాళ్లెవరూ ఇక్కడ లేరని చైనా స్పష్టం చేసింది. బ్లాక్ మెయిల్లకు తలొగ్గేది లేదని మరోసారి తేల్చి చెప్పింది. చైనాను లక్ష్యంగా చేసుకుని అమెరికా వరుసగా టారిఫ్‌లను పెంచుతున్న వేళ చైనా కూడా దీటుగా అదే స్థాయిలో స్పందిస్తోంది. తాజాగా చైనాపై అమెరికా విధించిన సుంకాలు 145 శాతానికి చేరాయి. ఈ నేపథ్యంలో చైనా కూడా అదరక, బెదరక అమెరికాపై టారిఫ్‌లను 125 శాతానికి చేర్చింది. డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు ఏమాత్రం బెదిరేది లేదని చైనా తన ప్రతి చర్యతో స్పష్టం చేస్తూనే వస్తోంది. యుఎస్ చర్యలకు ప్రతి సవాళ్లు విసురుతోంది. గతంలో అమెరికా దిగుమతులపై సుంకాలను 84 శాతానికి పెంచగా, తాజా చర్యలతో దీన్ని 125 శాతానికి చేర్చింది. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల ట్రంప్ పలు దఫాలుగా ఈ సుంకాలను క్రమంగా పెంచుతూ 145 శాతానికి చేర్చారు. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమైంది.

యూరప్ కలిసి రావాలి : జిన్‌పింగ్

టారిఫ్‌లతో అమెరికా అధ్యక్షుడు చేస్తున్న బెదిరింపులను కలిసికట్టుగా ఎదుర్కొనాలంటూ ఇటీవల భారత్‌ను కోరిన చైనా, తాజాగా యూరప్ దేశాలు కూడా ఈ విషయంలో తమతో చేతులు కలపాలని కోరింది. అమెరికా టారిఫ్ బెదిరింపులపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందిస్తూ, చైనాపై అమెరికా విధించిన 145 శాతం సుంకాలు ఏకపక్ష బెదిరింపులని వ్యాఖ్యానించారు. ఈ బెదిరింపులను ప్రతిఘటించడానికి యూరోపియన్ యూనియన్ తమతో కలిసి పోరాడాలని కోరారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ, చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సిన అవసరం వుందన్నారు. అప్పుడే తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందన్నారు. అదే విధంగా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కూడా కాపాడొచ్చన్నారు.



తుదికంటా పోరాటమే

అమెరికాతో టారిఫ్‌లకు సంబంధించి యుద్ధమే చేయాల్సి వస్తే తాము తుది వరకు పోరాడతామని చైనా స్పష్టం చేసింది. అమెరికా చర్చలకు సిద్ధపడితే తమ తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొంది. తాము ఘర్షణ పడేందుకు ప్రయత్నించబోమని, అదే సమయంలో ఎలాంటి ఒత్తిళ్లను ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని తెలిపింది. 'చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగానే చర్చలు జరగాల్సి వుంటుంది. చైనాతో ఒప్పందం చేసుకోవాలంటే ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ స్పష్టం చేశారు.

తిప్పేసిన నరైన్, వరుణ్

చెన్నై సూపర్‌కింగ్స్‌పై కోల్‌కతా ఘన విజయం
3వ స్థానానికి డిఫెండింగ్ ఛాంపియన్



చెన్నై: అత్యధిక టైటిళ్లు నెగ్గిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఈ సీజన్ ఐపిఎల్‌లో కలిసి రావడం లేదు. నూతన సారథిగా పగ్గాలు అందుకున్న మహేంద్ర సింగ్ ధోనీ కూడా చెన్నైను గాడిలో పెట్టలేకపోయాడు. చెపాక్ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో చెన్నై జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. చెన్నై నిర్దేశించిన 104పరుగుల లక్ష్యాన్ని కోల్‌కతా జట్టు 10.1ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. డికాక్(23), నరైన్(44)కి తోడు రహానే(20), రింకు(15) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు కోల్‌కతా స్పిన్నర్లు నరైన్(3/13), వరుణ్ చక్రవర్తి(2/22), మొయిన్ అలీ(1/20) కట్టడిగా బౌలింగ్ చేశారు. దీంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైను కేవలం 103పరుగులకే పరిమితం చేశారు. చెన్నై ఓపెనర్లు డెవాన్ కాన్వే(12), రచిన్ రవీంద్ర(4)లు విఫలమయ్యారు. మోయిన్ అలీ బౌలింగ్‌లో డెవాన్ కాన్వే స్వీప్ షాట్ ఆడబోయి ఎల్బీగా వెనుదిరిగడంతో మొదలు చెన్నై వికెట్ల పతనం మొదలైంది. హర్షిత్ రానా వేసిన షార్ట్ పిచ్ బంతికి రచిన్ రవీంద్ర(0) బోల్తా పడ్డాడు. 16 పరుగులకే 2 కీలక వికెట్లు పడిన దశలో విజయ్ శంకర్ (29), రాహుల్ త్రిపాఠి(16)లు ధాటిగా ఆడారు. దీంతో పవర్‌ప్లే 6ఓవర్లు ముగిసేసరికి చెన్నై 2వికెట్ల నష్టానికి 31 పరుగులు చేసింది. ఆ తర్వాత సునీల్ నరైన్ మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. శంకర్, దీపక్ హుడా(0)లను వరుణ్ చక్రవర్తి ఔట్ చేయగా.. అశ్విన్(1)ను హర్షిత్ రానా పెవిలియన్ పంపాడు. జడేజా(0), ఎంఎస్ ధోనీ(1)ని ఎల్బీగా ఔట్ చేసి సీఎస్కే భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు నరైన్. ప్రధాన ఆటగాళ్లంతా డగౌట్ చేరడంతో శివం దూబే(31 నాటౌట్)కు సహరించేవాళ్లు కరువయ్యారు. వైభవ్ అరోరా బౌలింగ్‌లో నూర్ అహ్మద్(1) కొట్టిన బంతిని వెంకటేశ్ అయ్యర్ డైవ్ చేస్తూ సూపర్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో చెన్నై 79 పరుగుల వద్ద 9వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత దూబే 19వ ఓవర్లో బౌండరీతో కొట్టాడు. 20వ ఓవర్లో ఫైన్ లెగ్ దిశగా ఫోర్.. ఆఖరి బంతికి బౌండరీ కొట్టి స్కోర్ 100 దాటించాడు. డెత్ ఓవర్లలో మూడు బౌండరీలతో 100 దాటించి.. జట్టుకు గౌరవ ప్రదమైన స్కోర్ అందించాడు. ఈ ఎడిషన్‌లో ఇదే అత్యల్ప స్కోర్ కావడం విశేషం. ఛేదనలో విఫలమయ్యే చెన్నై బ్యాటర్లు ఈసారి తొలిగా బ్యాటింగ్ అవకాశం దక్కినా ప్రత్యర్థి జట్టుకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో విఫలమయ్యారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నరైన్‌కు లభించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	5	4	1	8	+1.41
ఢిల్లీ	4	4	0	8	+1.27
కోల్‌కతా	6	3	3	6	+0.80
బెంగళూరు	5	3	2	6	+0.53
పంజాబ్	4	3	1	6	+0.28
లక్నో	5	3	2	6	+0.07
రాజస్తాన్	5	2	3	4	-0.77
ముంబయి	5	1	4	2	-0.01
చెన్నై	6	1	5	2	-1.55
సన్‌రైజర్స్	5	1	4	2	-1.62

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ రవీంద్ర (సి)రహానే (బి)హర్షిత్ రాణా 4, కాన్వే (ఎల్‌బి)మొయిన్ 12, త్రిపాఠి (బి)నరైన్ 16, విజయ్ శంకర్ (సి)మొయిన్ (బి)వరుణ్ చక్రవర్తి 29, దూబే (నాటౌట్) 31, అశ్విన్ (సి)వైభవ్ అరోరా (బి)హర్షిత్ రాణా 1, జడేజా (సి)డికాక్ (బి)నరైన్ 0, హుడా (సి)వైభవ్ అరోరా (బి)వరుణ్ చక్రవర్తి 0, ధోనీ (ఎల్‌బి)నరైన్ 1, నూర్ అహ్మద్ (సి)వరుణ్ చక్రవర్తి (బి)వైభవ్ అరోరా 1, కంబోజ్ (నాటౌట్) 3, అదనం 5. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 103పరుగులు. **వికెట్ల పతనం:** 1/16, 2/16, 3/59, 4/65, 5/70, 6/71, 7/72, 8/75, 9/79

బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-31-1, మొయిన్ అలీ 4-1-20-1, హర్షిత్ రాణా 4-0-16-2, వరుణ్ 4-0-22-2, నరైన్ 4-0-13-3.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (బి)కంబోజ్ 23, నరైన్ (బి)నూర్ అహ్మద్ 44, రహానే (నాటౌట్) 20, రింకు సింగ్ (నాటౌట్) 15, అదనం 5. (10.1ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 107పరుగులు. **వికెట్ల పతనం:** 1/46, 2/85

బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 3-0-40-0, కంబోజ్ 2-0-19-1, అశ్విన్ 3-0-30-0, నూర్ అహ్మద్ 2-0-8-1, జడేజా 0.1-0-9-0.

ఐపిఎల్‌లో నేడు

లక్నో సూపర్‌జెయింట్స్ × గుజరాత్ టైటాన్స్
వేదిక: లక్నో; మ.3.30గం॥లకు

సన్‌రైజర్స్ హైదరాబాద్ × పంజాబ్ కింగ్స్
వేదిక: హైదరాబాద్; రా.7.30గం॥లకు

రూ.4 కోట్లు నగదు చాలు: వినేశ్ ఫొగాట్



చండీగఢ్: స్టార్ మహిళా రెజ్లర్, జులనా నియోజకవర్గ ఎమ్మెల్యే వినేశ్ ఫొగాట్ రూ.4కోట్ల నగదును మాత్రమే ఎంచుకుంది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ఫొగట్ రెజ్లింగ్ ఫైనల్లో అధిక బరువు కారణంగా తృటిలో పతకాన్ని కోల్పోయింది. దీంతో వినేశ్‌కు హర్యానా ప్రభుత్వం రూ.4 కోట్ల నగదు రివార్డును అందజేస్తానని అప్పుడే ప్రకటించింది. తాజాగా 4 కోట్ల క్యాష్ రివార్డు లేదా అంతే విలువైన ప్లాట్ కావాలా? లేక ఎ-1గ్రేడ్ గవర్నమెంట్ ఉద్యోగం కావాలా అని క్రీడా శాఖ కోరింది. దీనికి వినేశ్ తనకు కేవలం రూ.4కోట్ల నగదు మాత్రమే చాలని తెలిపింది. 'వినేశ్‌కు నగదు ఇవ్వాలని ఇటీవల క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. మూడు ఆప్షన్లలో ఆమె దేన్నయినా ఎంచుకోవచ్చు' అని హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ తెలిపారు. అయితే ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం వల్ల ఆమె ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హురాలు. క్యాష్ లేదా ప్లాట్ తీసుకునే ఆప్షన్లకు అవకాశం ఇచ్చాం అని సిఎం తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరి, జులనా నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో గెలిచారు.

క్వార్టర్స్‌లో ఓడిన తానీషా కాస్ట్రో-ధృవ్ కపిల
ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్

నింగ్బో(చైనా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన తానీషా కాస్ట్రో-ధృవ్ కపిల జంట శుక్రవారం జరిగిన పోటీలో ఓటమిపాలయ్యారు. హోరాహోరీగా సాగిన క్వార్టర్‌ఫైనల్లో తానీషా కాస్ట్రో-ధృవ్ కపిల 20-22, 13-21తో హాంకాంగ్‌కు చెందిన టాంగ్-సూ చేతిలో పోరాడి ఓడారు. తొలి గేమ్ హోరాహోరీగా సాగింది. ఆ గేమ్‌ను తానీషా-కపిల 20-20పాయింట్లతో సమం నిలిచి వరుసగా 2పాయింట్లు చేజార్చుకొని ఆ గేమ్‌ను చేజార్చుకున్నారు. రెండో గేమ్‌లో రాణించలేక ఓటమిపాలయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68